ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 16 అక్టోబరు 2024 | 5

మీది 'మంచి' ఆహారమేనా..!

» నేడు ప్రపంచ ఆహార దినోత్సవం
6

జిల్లాలో భారీవర్షం

» రహదారులు జలమయం
» అల్పపీడన ప్రభావంతో వాన


పిఠాపురం పట్టణంలో జోరుగా కురుస్తున్న వర్షం

పిఠాపురం/గొల్లప్రోలు/తుని రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల మంగళవారం భారీవర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆకాశంలో దట్టంగా మేఘాలు అలముకుని తెల్లవారుజామున 4 గంటలనుంచి ఉదయం 10 గంటల వరకూ నాలుగు విడతలుగా వర్షం పడింది. దీంతో జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ డ్రెయిన్లు పొంగిపొర్లాయి. రోడ్లు మీదకు నీరు చేరడంతో అందులో నుంచే వాహనదారులు రాకపోకలు సాగించారు. ఈదురుగాలులతో వర్షం పడడంతో ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు ఇబ్బందులు పడ్డారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి తునిలో తాండవ నదికి వర్షపునీరు పోటెత్తింది. తుఫాన్ ప్రభావంపై మత్స్యకారులతోపాటు రైతులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.


ఉప్పాడ కొత్తపల్లిలో బీచ్‌రోడ్డును తాకుతున్న సముద్ర కెరటాలు

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి

» వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

కలెక్టరేట్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న ఐదురోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండలస్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 15 నుంచి 17 వరకు భారీవర్షాలు సంభవించవచ్చని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాల కారణంగా ఏదైనా సమస్య తలెత్తితే టోల్‌ఫ్రీ 18004253077 నెంబరుతోపాటు 99591 51144, 95051 85244, 85220 86785, 99131 48180, 91772 17896, 63011 09905 నెంబర్లను సంప్రదించాలన్నారు. జిల్లాలో అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలకు పైన నెంబర్లను సంప్రదించాలన్నారు.



అల్పపీడనం హెచ్చరికల కారణంగా కొత్తపల్లి మండలంలో ఒడ్డున నిలిచిపోయిన బోట్లు


తుని పట్టణంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నది

మందే మందు!



» జిల్లాలో నేటి నుంచే కొత్త ప్రైవేటు మద్యం దుకాణాలు
» ఒక్కో వైన్‌షాపునకు డిపోల నుంచి రూ.10లక్షల మద్యం కేటాయింపు
» 100 కేసుల ఐఎంఎల్, 50 కేసుల బీర్లు విక్రయానికి సిద్ధం
» గత వైసీపీ సర్కారు విక్రయించిన నాసిరకం మద్యం బ్రాండ్లకు ఇక చెల్లు
» కొత్తగా లగ్జరీ సుప్రీం విస్కీ, ఇంపీరియల్‌బ్లూ, రాయల్‌ఛాలెంజర్ విస్కీలు
» రూ.180చొప్పున చిన్నసీసాల్లో విక్రయానికి సిద్ధం చేసిన అధికారులు
» గడచిన ఐదేళ్లపాటు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఈబ్రాండ్ల అడ్రస్ లేని వైనం
» లాటరీలో దుకాణాలు దక్కినా ఎక్కడా షాపులు దొరక్క నానాతంటాలు


గొల్లప్రోలులో ఏర్పాటు చేసిన ప్రైవేటు మద్యం దుకాణం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ గత ఐదేళ్లపాటు జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించిన నాసిరకం మద్యానికి ఇక చెల్లుచీటి పడింది. నాణ్యతలేని మందు విక్రయించి కోట్లలో గడించిన అప్పటి పెద్దల అక్రమాలకు ఇకనుంచి పూర్తిగా చెక్ పడనుంది. తక్కువ ధరకు, ప్రముఖ కంపెనీలకు చెందిన నాణ్యమైన మందు బుధవారం నుంచి జిల్లాలో మందుబాబులకు దొరకనుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేస్తున్న కొత్త ప్రైవేటు మద్యం దుకాణాలు నేటినుంచి జిల్లాలో విక్రయాలు ప్రారంభించనున్నాయి. ఈ మేరకు ఒక్కో దుకాణానికి జిల్లా ఎక్సైజ్‌శాఖ మంగళవారం అర్ధరాత్రి వరకు సరుకు పంపిణీ చేసింది. ఒక్కో దుకాణం యజమానికి రూ.10లక్షల విలువైన మద్యాన్ని కేటాయించింది. 100 కేసుల ఐఎంఎల్, 50 కేసుల బీరు విక్రయాలకు సిద్ధం చేసింది. కొత్త దుకాణాల్లో ఐదేళ్ల తర్వాత మళ్లీ నేటి నుంచి ప్రముఖ బ్రాండ్లు కనిపించబోతున్నాయి. ఈ మేరకు లగ్జరీ సుప్రీం విస్కీ, ఇంపీరియల్‌బ్లూ, రాయల్‌ఛాలెంజర్ విస్కీలు జిల్లాలో మద్యం డిపోకు చేరుకున్నాయి. రూ.180 చొప్పున వీటిని బుధవారంనుంచి విక్రయించనున్నారు. కాగా లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులకు ఎక్కడా రద్దీప్రాంతాల్లో షాపులు దొరక్క తంటాలు పడుతున్నారు. అవన్నీ ముందే కొందరు వైసీపీనేతలు గుప్పిట్లో ఉంచేసుకోవడంతో షాపులు దొరక్క చాలామంది ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. తొలిరోజు జిల్లాలో సగానికిపైగా దుకాణాలే తెరుచుకోనున్నాయి.

తాగినోళ్లకు తాగినంత..

జిల్లాలో కొత్తగా 155 మద్యం దుకాణాలకు సోమవారం జిల్లా ఎక్సైజ్‌శాఖ లాటరీ తీసింది. అందులోభాగంగా షాపులు దక్కిన వారందరి నుంచి రూ.65లక్షలు, రూ.55లక్షల కేటగిరీలకు సంబంధించి తొలి వాయిదాను రాబట్టింది. కలెక్టరేట్‌లో స్టేట్‌బ్యాంకులో సమస్యల కారణంగా మంగళవారం మధ్యాహ్నం వరకు ఈప్రక్రియ కొనసాగింది. బుధవారం నుంచి కొత్త దుకాణాల్లో మద్యం విక్రయాలు ప్రారంభం కావాల్సి ఉన్న నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి వరకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులు సంబంధిత లైసెన్సుల జారీ ప్రక్రియ నిర్వహించారు. లాటరీలో షాపులు దక్కించుకున్న వారు దుకాణాలు చూపించాల్సి రావడం, కొత్త షాపుల్లో నేటినుంచి సరుకు విక్రయించాల్సి ఉండడంతో దానికి కావాల్సిన స్టాకును డిపోనుంచి తీసుకువెళ్లే ప్రక్రియ కొనసాగింది. కొత్త మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో కూటమి ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ కొన్ని నిబంధనలతో కూడిన ఆదేశాలు జారీచేసింది. దాని ప్రకారం జాతీయ రహదారిని ఆనుకుని 220మీటర్లలోపల దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో కాకినాడ రూరల్, గొల్లప్రోలు, పిఠాపురం, శంఖవరం, తుని, ప్రత్తిపాడు, తొండంగి, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి తదితర మండలాల్లో లాటరీలో షాపులు దక్కించుకున్న వ్యాపారులు దుకాణాలు దొరక్క తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కాకినాడసిటీ, కాకినాడ రూరల్‌లో అయితే ఇప్పటికే రద్దీప్రాంతాల్లో షాపులన్నీ ఇప్పటికే కొందరు వైసీపీ నేతలు తమ గుప్పిట్లో ఉంచుకోవడంతో ఎక్కడా కీలక ప్రాంతాల్లో దుకాణాలు దొరకలేదు. దీంతో వీరంతా తాత్కాలికంగా 15రోజులపాటు ఎక్కడ షాపు దొరికితే అక్కడ దుకాణం తెరవాలని నిర్ణయించారు. ఆతర్వాత రద్దీ ప్రాంతాలకు వీటిని మార్చనున్నారు. దుకాణాలు రద్దీ ప్రాంతాల్లో దొరకడం కష్టంగా మారిన నేపథ్యంలో తొలిరోజు బుధవారం కొన్నిషాపులే తెరుచుకునే అవకాశం ఉంది. బుధవారం నుంచి ప్రారంభంకానున్న కొత్త మద్యం దుకాణాలకు మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సరుకు కేటాయింపు కొనసాగింది. ప్రభుత్వం నుంచి మార్జిన్లకు సంబంధించి ఆదేశాలు ఆలస్యంగా అధికారులకు చేరుకున్నాయి. కొత్త మద్యం షాపుల్లో మందు విక్రయాలకు సంబంధించి ధరలు కూడా సాఫ్ట్ వేర్‌లో ఆలస్యంగా రావడంతో ఎక్సైజ్ అధికారులు రోజంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

కొత్త బ్రాండ్లొచ్చేశాయ్...

గత వైసీపీ సర్కారు హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యం విక్రయించి మందుబాబుల ఆరోగ్యాన్ని గుల్లచేసేశారు. కూటమి ప్రభుత్వం ఈ నాసిరకం మద్యం మొత్తాన్ని తొలగించి నాణ్యమైన మద్యం విక్రయిస్తామని హామీ ఇచ్చింది.ఈనేపథ్యంలో బుధవారంనుంచి మొదలుకానున్న దుకాణాల్లో అమ్మకానికి కొత్తగా 180ఎంఎల్ సైజు సీసాలో రూ.180కి లగ్జరీ సుప్రీం విస్కీ, రూ.180కి సీగ్రాం ఇంపీరియల్ బ్లూ సెలెక్టెడ్ విస్కీ, రూ.230కి రాయల ఛాలెంజర్ సెలెక్ట్ గ్లోబల్ విస్కీని విక్రయించబోతోంది. ఈబ్రాండ్లు గడచిన ఐదేళ్లలో జిల్లాలో ఎక్కడా విక్రయాలకు నోచుకోలేదు. అలాగే కార్ల్‌బర్గ్ ఎలిఫెంట్ బీరు కూడా అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. ఇవన్నీ గత వైసీపీ సర్కారులో అడ్రస్ లేకుండా పోయాయి. చీప్‌లిక్కర్ రూ.99కే విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ స్టాకు త్వరలో జిల్లాకు రానుంది. కొత్త మద్యం దుకాణాలకు డిపోనుంచి ఒక్కో దుకాణానికి 100కేసుల ఐఎంఎల్‌ఎల్, 50కేసుల చొప్పున బీర్లను కేటాయించారు. ఈవిక్రయాలు పూర్తికాగానే మరికొంత సరుకు కేటాయించనున్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నారాయణ



కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణను నియమించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయంనుంచి ఉత్తర్వులను మంగళవారం వెలువరించారు. ఆయన త్వరలో బాధ్యతలను స్వీకరించనున్నారు. గత ప్రభుత్వంలో కాకినాడ జిల్లా ఏర్పాటైన తర్వాత తొలి ఇన్‌ఛార్జి మంత్రిగా అప్పటి మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వ్యవహరించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నారాయణకు అవకాశం దక్కింది. ఆయన జిల్లాలో జరిగే అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటారు.

ఆహార పదార్థాలు ఇలా ఉంటే తినగలరా

» మధ్యాహ్న భోజన పథకం తీరుపై కలెక్టర్ అసంతృప్తి


పిఠాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టరు

పిఠాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు ఇలాఉంటే మీరు తింటారా, నాణ్యత సరిగా లేకుంటే ఏం చేస్తున్నారంటూ జిల్లా కలెక్టరు షాన్‌మోహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పిఠాపురం పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పదార్థాల నాణ్యత అంతంత మాత్రంగానే ఉండడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనంలో ఉండే పదార్థాల నాణ్యత మెరుగుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లను పరిశీలించి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు

» జిల్లావ్యాప్తంగా 18 ప్రత్యేక కౌంటర్లు
» జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు (ఆంధ్రజ్యోతి), 15: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకే అందజేయడానికి 18 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈకౌంటర్లలో లీటరు పామాయిల్ రూ.110కి, లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కే లభిస్తున్నాయి. కిలోఉల్లి ఒక రకం రూ.46కి, మరొక రకం రూ.40కే విక్రయిస్తున్నారు. టమోటా కిలో రూ.40కే అమ్ముతున్నారు. ప్రధానంగా కౌంటర్లు కాకినాడ, పెద్దాపురం రైతుబజార్లలో నాలుగు ఏర్పాటు చేశారు. కాకినాడ, తుని, ఏలేశ్వరం, పెద్దాపురం, కత్తిపూడి, పిఠాపురంల్లో ఉన్న డీమార్ట్, విజేత మాల్స్, రిలయన్స్ మాల్స్, ఇతర దుకాణాల్లో మరో 14ఏర్పాటు చేశారు. తెల్లరేషన్‌కార్డు తీసుకెళ్తే ఒక్కొక్క లబ్ధిదారుడికి మూడు పామాయిల్ ప్యాకెట్లు, ఒక సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ పొందవచ్చునని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు.

కొబ్బరికాయ నుంచి.. ఏడు మామిడి మొక్కలు

కరప, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒక ఎండిన కొబ్బరికాయ ముచ్చిక నుంచి ఏకంగా ఏడు మామిడి మొక్కలు పుట్టుకురావడం సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. ఏంటీ వింతా.. అనుకుంటూ చుట్టుపక్కల వాళ్లు దాన్ని చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం కాండ్రేగుల శివారు గ్రామం గుబ్బలవారిపాలెంలో నివాసముంటున్న పంపన సూరిబాబు, మంగాయమ్మ దంపతులు విజయవాడ దుర్గమ్మ చెంతన భవానీ దీక్ష విరమించి సోమవారం ఇంటికి తిరిగి చేరుకున్నారు. ఇంటి పరిసరాల్లో ఎండిన ఒక కొబ్బరికాయలో నుంచి మామిడి మొక్కలు మొలకెత్తడం చూసి ఆశ్చర్యపోయారు. స్థానిక పెద్ద పేకేటి మాధవకు ఈ వింత గురించి చెప్పారు. ఎండిన కొబ్బరికాయలోకి వేళ్లు చొచ్చుకుపోయి బయటకు ఏపుగా ఎదిగిన ఏడు మామిడి మొక్కలు కనిపించాయి. ఆ నోట.. ఈ నోట విషయం బయటకు పొక్కడంతో పలువురు ఈ వింతను చూసేందుకు అక్కడికి ఎగబడుతున్నారు. కొబ్బరికాయలో నుంచి మామిడి మొక్కలు ఉద్భవించడం అసాధ్యమని కూరాడ హైస్కూల్‌లో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు బీఎల్ ప్రసాద్ తెలిపారు. బహుశా ఆ కొబ్బరికాయకు చేరువలోని మామిడి టెంక నుంచి మొక్క వచ్చి దాని వేర్లు కొబ్బరికాయలోకి చొచ్చుకుపోయి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.


కొబ్బరికాయనుంచి మొలిచిన మామిడి మొక్కలు


విశాఖలో నిర్వహిస్తున్న మలబార్ విన్యాసాలు

నౌకాదళ విన్యాసాల్లో పాల్గొనేందుకు.. శాన్ మెరైన్ సంస్థకు స్థానం

» అమెరికాకు చెందిన యుద్ధనౌకకు సహాయక సేవలందించిన మెరైన్ సంస్థ

కాకినాడ సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా సముద్రంలో ప్రారంభమైన మలబార్-2024 అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాల్లో పాల్గొనేందుకు కాకినాడకు చెందిన శాన్‌మెరైన్ షిప్పింగ్ సంస్థకు స్థానం లభించింది. భారత్‌తో కలిసి అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా వంటి ప్రధాన దేశాల యుద్ధనౌకలు పాల్గొనడంతో ప్రత్యేకత సంతరించుకుంది. ఈ మలబార్ అంతర్జాతీయ నౌకాదళ వేడుకల్లో పాల్గొన్న అమెరికాకు చెందిన యుద్ధనౌకకు శాన్ మెరైన్ సంస్థ సహాయక సేవలు అందించింది. ఈ సంస్థ మలబార్ ఎక్సర్‌సైజ్-2024తోపాటు గతంలో భారత నౌకాదళం నిర్వహించిన ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ వేడుకల్లోను పాల్గొంది. ఈ సందర్భంగా శాన్ మెరైన్ సంస్థ ఎండీ ఆలీషా మాట్లాడుతూ మలబార్ అంతర్జాతీయ వేడుకల్లో తమ సంస్థ పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. భారత నౌకాదళం చేపట్టే కార్యక్రమాలకు తమసంస్థ ద్వారా సహాయక సేవలందిస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు చినరాజప్ప, సత్యప్రభతోపాటు టీడీపీ నేతలు జ్యోతుల నవీన్, పిల్లి అనంతలక్ష్మి

ఎమ్మెల్సీ విజయం మనదే కావాలి

మళ్లీ సార్వత్రిక ఎన్నికల ఒరవడి కొనసాగాలి.. గెలుపు మనదే కావాలి.. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై మంగళవారం రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు.. అభ్యర్థి ఎవరైనా గెలుపు బాట వేయాలన్నారు. - వివరాలు 7లో

'ప్రధానమంత్రి సూర్యఘర్'పై ప్రజలకు అవగాహన కల్పించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు(ఆంధ్రజ్యోతి), 15: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి ఎక్కువమంది ఈ సదుపాయాన్ని వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన అమలు, దరఖాస్తు లబ్ధిదారుల వివరాలు వంటి అంశాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. పీఎంసూర్యఘర్ యోజన గోడ పత్రికను ఆవిష్కరించారు.

తునిలో 84 నకిలీ మద్యం సీసాలు పట్టివేత

తునిరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తునిలో పోలీసుల తనిఖీల్లో నకిలీ మద్యం సీసాలు పట్టుకున్నారు. కొంతమంది నకిలీమద్యం బాటిళ్ల పై గోవాలిక్కర్ లేబుల్లు అతికించి గ్రామాల్లో సరఫరా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రాపాక గ్రామంలోని పట్టుపురుగుల పరిశ్రమల్లో గోవా లిక్కర్ లేబుళ్లతో ఉన్న నకిలీ 84 మద్యం సీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి తెలిపారు.

బాలల పరిరక్షణ విభాగంలో పోస్టులకు ఇంటర్వ్యూలు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కాకినాడ శిశుగృహలో ఖాళీగాఉన్న పోస్టుల భర్తీకి జేసీ రాహుల్‌మీనా మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సామాజిక కార్యకర్తలు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమ సాధికారిత అధికారిణి కొండా ప్రవీణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సూర్యప్రభావతి, పాల్గొన్నారు.



మీది..'మంచి' ఆహారమేనా..

నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

మనకున్న ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి దిక్సూచి. ఏం తింటున్నాం, ఎలా తింటున్నాం, ఎంత తింటున్నాం.. ఈ విషయాలే మంచి ఆరోగ్యానికి పునాది వేస్తాయి. కొవిడ్ తర్వాత.. చాలామందిలో ఆహారపు అలవాట్లు మారాయి. పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం అధికమైంది. నాణ్యమైన ఆహారం స్వీకరించాలనే అభిరుచి పెరిగింది. అవకాశం ఉన్నవాళ్లు సేంద్రియ ఉత్పత్తులను ఎంచుకొని మరీ ఆహారంగా ఎంచుకుంటున్నారు. మిగిలినవాళ్లు నాణ్యమైన ఉత్పత్తులో కాదో తెలుసుకుని, ఆరా తీసి సదరు ఆహార ఉత్పత్తులను కొంటున్నారు. అదే సమయంలో ప్రజల ఆహారపు అభిరుచులు, అలవాట్లను వ్యాపారంగా మలుచుకుని నకిలీ ఆహార ఉత్పత్తులను వారికి అంటగట్టే మాయాజాలం పెరిగిపోయింది. అవి కల్తీ ఉత్పత్తులో కాదో తెలియనంత మోసం... వాటిని నియంత్రించాల్సిన వ్యవస్థలు చురుకుగా ఉంటేనే నాణ్యమైన ఆహారం ప్రజలకు లభిస్తుంది. నాణ్యతను పరీక్షించే వ్యవస్థలదే ఈ బాధ్యత. మరోవైపు రైతులు సేంద్రియ ఉత్పత్తులను అందించి ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలవాలని పెద్ద కృషే చేస్తున్నారు. మన ప్రాంతంలో మంచి ఆహారం అందించేందుకు జరుగుతున్న కృషిపై ప్రత్యేక కథనం.



కాలబట్టి వరి ధాన్యం

నవారా ధాన్యం

చిరుధాన్యాలతోనే జీవనం!

పోడు భూముల్లో చిరుధాన్యాలు పండిస్తున్న కొండరెడ్లు




చింతూరు మండలం రత్నాపురంలో లైన్ షోయింగ్ పద్ధతిన వరి సాగులో కలుపు నివారణ చర్యలు



అడవుల్లో పండిస్తున్న జొన్న పంట

కూనవరం (ఆంధ్రజ్యోతి): కొండరెడ్లు... బాహ్య ప్రపంచానికి ఎక్కడో దూరంగా ఉండి జీవిస్తుంటారు. అడవుల్లో తలదాచుకునే వీరు పోడు భూమి వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తారు. వీరి ముఖ్య పంట చిరుధాన్యాలు. కూనవరం మండలంలోని గుట్టలపై కారుమానుకొండ, గబ్బిలాల గొంది, కోపిరిమెట్ట, బావిబొక్క, ఎరుగుమామిడిగొంది తదితర గ్రామాల కొండరెడ్ల ప్రజలు నివాసముంటున్నారు. వారు అక్కడ గుట్టలపై భూములు చదును చేసుకుని పంటలు పండిస్తారు. జొన్న, సాములు, కొర్రలు వీరి ముఖ్య పంటలు. ఈ పంటలను వర్షాధారం మీదే సాగు చేస్తారు. పండించిన పంటల్లో ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడరు. పండిన చిరుధాన్యాల పంటలను తమ కుటుంబ పోషణకు కొద్దిగా ఉంచుకుని మరికొంత చిరుధాన్యాలను సంతల్లో అమ్ముకుంటున్నారు.



జేఎన్‌టీయూకేలో ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ

తిండి కూడా తెలుసుకోవాల్సిందే

- 2014లో జేఎన్టీయూకేలో ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీ ఏర్పాటు
- ఆహార పదార్థాల నాణ్యతా పరీక్షలకు రాష్ట్రంలో ఇదొక్కటే కేంద్రం

జేఎన్టీయూకే (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ప్రతీ ఒక్కరిలో తినే ఆహార పదార్థాల నాణ్యతపై శ్రద్ధ పెరిగింది. ముఖ్యంగా ఆహార నాణ్యతపై అవగాహనతోపాటు వాటి ప్రమాణాలను తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీనికోసం దేశంలో 232 ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీలుండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడు ఉండేవి. అయితే తెలంగాణ విడిపోయిన తరువాత విభజిత ఏపీలో ఒక్క ల్యాబ్ కూడా లేకపోవడంతో కాకినాడ జేఎన్టీయూకేలో 2014లో ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీని ఏర్పాటుచేశారు. ఆహార ఉత్పత్తుల పరీక్ష అనేది చాలా ముఖ్యం. దీనివల్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పర్యవేక్షించబడతాయి. ఆహారంలో భౌతిక, రసాయనిక, జీవసంబంధమైన ప్రమాదాలు లేవని నిర్ధారించడానికి ఈ పరీక్ష అవసరం. అంతేకాకుండా ఆహారంలోని శాస్త్రీయ విశ్లేషణను తెలియజేస్తుంది. కంటికి కనిపించని లోహాలు, ఎశ్చరీషియా కోలై బ్యాక్టీరియా, సాల్మోనెల్లా, క్లీనింగ్ ఏజెంట్లు, సంకలనాలు, పురుగు మందులు వంటి వాటిని ఈ పరీక్షల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. రోజురోజుకు పెరుగుతున్న మానవ వనరుల ఆవశ్యకతను గుర్తించి జేఎన్టీయూకేలో విశ్రాంత ప్రొఫెసర్ పి.రామకృష్ణ సూచనలు, సలహాలతో 2010-11లో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీని ప్రారంభించి ఫుడ్‌ప్రాసెసింగ్ టెక్నాలజీలో రెండేళ్ల కాల వ్యవధి గల ఎంటెక్ కోర్సును ప్రవేశపెట్టారు. అదేవిధంగా 2020-21లో ఫుడ్ ఇంజనీరింగ్‌లో బీటెక్ కోర్సును ప్రారంభించారు. 2014లో ఐదుగురు సభ్యులతో పరీక్ష శాలను ఏర్పాటుచేయగా దేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ అర్హత కలిగిన ఆహార విశ్లేషకులు 132 మంది ఉండగా రాష్ట్రంలో ఏడుగురు మాత్రమే ఉన్నారు. వారిలో కె.విజయలక్ష్మి, మరో ఐదుగురు ల్యాబ్ సైంటిస్టులు ఇక్కడ సేవలందిస్తున్నారు. ఎగుమతి తనిఖీమండలి(ఈఐసీ), అగ్రికల్చర్ ప్రొడ్యూస్ ఎక్స్‌పోర్ట్ డవలప్‌మెంట్ అథారిటీ నుంచి గుర్తింపు పొందిన తరువాత సీఫుడ్, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, తృణధాన్యాలు, పప్పులు, హెవీ మెటల్స్‌లోని యాంటీబయాటిక్స్‌ను పరీక్షించే అవకాశముందని స్కూల్ ఆఫ్ ఫుడ్‌టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ తెలిపారు. అదేవిధంగా దిగుమతి చేసుకున్న నూనెలను కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి నాణ్యతను విశ్లేషించడానికి తమకు వస్తున్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు లైసెన్స్ జారీ చేసే ముందు ఆహార నమూనాలను విశ్లేషణ కోసం పంపిస్తే వాటిని పరీక్షిస్తామన్నారు. 2014 నుంచి ఇప్పటివరకూ సుమారు 4200 పరీక్షలు నిర్వహించి ఆమోదాన్ని తెలిపామన్నారు.



డాక్టర్ మాలోతు రమేష్

ఎవరైనా పరీక్ష చేయించుకోవచ్చా..

వర్సిటీలో ఏర్పాటుచేసిన ఫుడ్‌టెస్టింగ్ ల్యాబ్‌లో ప్రజలు సైతం నామమాత్రపు రుసుం నిబంధనల ప్రకారం చెల్లించి తమకు సందేహాలున్న వాటిని తనిఖీ చేయించుకునే అవకాశముంది. పిల్లలు తాగేపాలు, మంచినీటి దగ్గర నుంచి నెయ్యి, వంట నూనె, తినే కూరగాయలు, వాటిని పండించేందుకు వాడే రసాయనాలు, క్రిమిసంహారక మందులు ఇలా అన్నింటినీ తనిఖీచేసి వాటి నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునే అవకాశముంది. ఏపీలో ఏకైక ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫాస్టాక్ ట్రైనింగ్ పార్టనర్‌గా గుర్తింపు పొందిన సంస్థ జేఎన్టీయూకే అని డాక్టర్ మాలోతు రమేష్ తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందివ్వాలనే ఉద్దేశంతో..

పెరవలి (ఆంధ్రజ్యోతి) : తమ కుటుంబంతోపాటు గ్రామస్తులకు కూడా ఎటువంటి పురుగు మందులు అవశేషాలు లేని నాణ్యమైన ఆహార ధాన్యాలు అందించాలనే ఉద్దేశంతో పెరవలి మండలం తీపర్రుకు చెందిన అభ్యుదయ రైతు కంటిపూడి సూర్యనారాయణ గత పదేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం బాట పట్టారు. తనకున్న రెండు ఎకరాల భూమిలో ఎటువంటి ఎరువులు పురుగు మందులు వాడకుండా ఉన్నారు. ఆకుమడి లగాయతు కోత కోసే వరకు కేవలం వివిధ రకాల ఆకుల కషాయం, పశువుల పేడ, ఆవు మూత్రంతో తయారుచేసిన వివిధ రకాల ద్రవాలను పంటలపై వెదజల్లుతూ భూమిపై వేస్తూ వరిని సాగు చేస్తున్నారు. ఎకరానికి 25 బస్తాలు వరకు దిగుడి వస్తోందన్నారు. తానే సొంతంగా మిల్లులకు తీసుకెళ్లి వాటిని మర ఆడించి 25 కిలోల బస్తాలుగా ప్యాక్ చేయించి తక్కువ ధరకే స్థానిక ప్రజలకు విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో 25 కిలోల బియ్యం బస్తా 1300 అమ్మేవాడినని, ప్రస్తుతం గిట్టుబాటు కాకపోవడంతో 1500 విక్రయిస్తున్నట్టు చెప్పారు. వరి కోసిన అనంతరం ఇదే భూమిలో కూరగాయలు కూడా పండిస్తానని తెలిపారు. ఇదే తరహా పంటలనే పండించాలని అనుకున్నట్టు చెప్పారు.



ప్రకృతి సాగులో పొలం గట్లపై అరటి, కొబ్బరి చెట్ల పెంపకం.. (పక్కన) ప్రకృతి సహజ సాగు కోసం జీవామృతం తయారీ

ప్రకృతి సాగుతో సురక్షిత ఆహారం

ఆ దిశగా అడుగులు వేస్తున్న ఆదివాసీ రైతులు... 11 వేల ఎకరాల్లో సాగు

చింతూరు (ఆంధ్రజ్యోతి) : కాంప్లెక్స్ ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగంతో భూసారం నానాటికి క్షీణిస్తోంది. అదే దశలో మానవాళి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వివిధ రుగ్మతలకు రసాయనిక ఎరువులతో పండించిన పంటలే కారణమని వైద్యులు సైతం హెచ్చరిస్తుంటారు. దీంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని రైతు సాధికారిత సంస్థ ప్రకృతి సాగుపై దృష్టి సారించింది. ఆ దిశగా రైతుకు అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఒక్క చింతూరు డివిజనులోనే 8500 మంది ఆదివాసీ రైతులు 11 వేల ఎకరాల్లో ప్రకృతి సాగుకు ఈ ఏడాది శ్రీకారం చుట్టారు. వీటిలో వరితోపాటు కూరగాయలు, అపరాల సాగు కూడా ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్న రైతులు వారే స్వయంగా సేంద్రియ ఎరువులను అతి తక్కువ ఖర్చుతో తయారు చేసుకుంటున్నారు. వీటిలో భూసారం పెంచే ఎరువుతోపాటు పురుగు నివారణ, అధిక దిగుబడి సాధించే ఎరువులు సైతం ఉన్నాయి. విత్తన శుద్ధికోసం బీజామృతం, పంట ఎదుగుదల, అధిక దిగుబడి, పురుగు నివారణ కోసం ఘనజీవామృతం, ద్రవజీవామృతం, నీమాస్త్రం వంటి కషాయాలను రైతు ఇంటి వద్దనే తయారు చేసుకుంటున్నారు. సేంద్రియ ఎరువు తయారు చేసుకొనేందుకు సెనగపిండి, ఎల్లుల్లి, మిర్చి, బెల్లం, పుట్టమట్టి. ఆవు మలమూత్రాలను వినియోగిస్తున్నారు. ఇవన్నీ తక్కువ వ్యయంతోపాటు అందుబాటులో లభ్యమయ్యేవే. మరోవైపు రోజురోజుకి పెరుగుతున్న సాగు వ్యయం రైతుని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కూలీల కొరత వ్యవసాయానికి పెద్ద లోటుగా మారింది. దీంతో అధిక దిగుబడులు సాధిస్తే గాని రైతు గట్టెక్కలేని పరిస్థితి ఉంది. లేదంటే అప్పుల ఊబిలో కూరుకపోక తప్పదు. చేసేదేమి లేక నష్ట నివారణలో బాగంగా హైబ్రిడ్ వంగడాలు, కాంప్లెక్స్ ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం వైపు రైతు మళ్లాల్సి వస్తోంది. అయితే ఈ తరహా సాగు మానవాళి ఆరోగ్యంపై పడుతోంది. దీంతో ప్రభుత్వం ప్రకృతి సాగు దిశగా రైతులను మళ్లిస్తోంది.

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని రకాలు పండిస్తా

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని రకాలు పండిస్తాను. ఇప్పటివరకు 10 దేశవాళీ, రెండు హైబ్రిడ్ రకాలు ప్రకృతి సేద్యం పద్ధతిలో పండించాను. వరిలో ప్రపంచంలో 10 వేల దేశవాళీ రకాలు ఉంటే వివిధ రాష్ట్రాల్లో 120 రకాలు వరకు పండిస్తున్నారని తెలుసుకున్నాను. ఈ రకాలన్నీ ప్రస్తుతం ఉత్పన్నమవుతున్న ఆరోగ్య సమస్యలను కట్టడి చేస్తాయి. అయితే ఈ రకాలపై సరైన అవగహన లేక మార్కెట్‌లో డిమాండ్ లేదు. ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహిస్తే పంటలు పండించొచ్చు.

- జిత్తుగ శ్రీనివాస్, కౌలురైతు, పోతవరం

కృషీవలుడు జిత్తుగ శ్రీనివాస్

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి) : అధిక దిగుబడుల కోసం రైతులు హైబ్రీడ్ రకాలతోనే వరిసాగు చేస్తున్నారు. ఈ రకాల సాగులో ఎరువులు, పురుగుమందులు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. హైబ్రిడ్ రకాల బియ్యం తింటే ఆ ప్రభావం ఆరోగ్యంపై పడుతోంది. ఇలా అందరూ ఆధునిక సాగు పద్ధతులను అనుసరిస్తుంటే.. ఓ యువ కౌలురైతు మాత్రం పురాతన కాలంనాటి దేశవాళీ వంగడాలను సాగులోకి తెస్తున్నారు. గత ఏడేళ్లుగా ఈయన కృషి సాగిస్తూ వస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన యువ కౌలురైతు జిత్తుగ శ్రీనివాస్. 2012 నుంచి 2017 వరకు ఎక్కువ శాతం సేంద్రియ ఎరువులు, వర్మికంపోస్టు యూనిట్, జీవన ఎరువులు, వేపపిండి, వేపనూనె తదతర ఉత్పత్తులతో వరిలో హైబ్రిడ్ రకాలను పండించేవారు. 2017లో అప్పటి ప్రభుత్వం అమరావతిలో ఏర్పాటుచేసిన పాలేకర్ ఇచ్చిన శిక్షణలో పాల్గొని అప్పటి నుంచి ఏటా పలు దేశవాళి రకాలను పరిచయం చేస్తూ వస్తున్నాడు. ఇప్పటివరకు పది దేశవాళి రకాలతోపాటు రెండు హైబ్రిడ్ రకాలను ఈ పద్ధతుల్లోనే పండించారు. మొదటి ఏడాది ఒక ఎకరం పొలంలో ఐదు నుంచి ఆరు రకాలను పండించేవారు. క్రమేణా పది సెంట్ల పొలాన్ని ఎంచుకుని రెండు నుంచి మూడు రకాలను మాత్రమే పండిస్తున్నారు. పండించిన ధాన్యాన్ని మొదట్లో గిట్టుబాటు ధరకు అందించేవారు. కొంతకాలం తరువాత తన అవసరాలకు ఉపయోగించుకుని అనంతరం బంధువులకు పంచుతున్నారు. ఇప్పటివరకు ఆయన పండించిన వరి దేశవాళీ రకాలు.. కాలబట్టి, దూదేశ్వర్, ఇల్లపూసాంబ, తులసి భాసో, మైసూర్ మల్లిగా, కుళ్ళాకార్, చిట్టిముత్యాలు, నవారా నల్లబియ్యం.





కాదేదీ కల్తీకనర్హం

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి): అన్నిచోట్లా ఆహారం, ఆహార దినుసులు కల్తీ అవుతూనే ఉన్నాయి. ఫస్ట్ క్వాలిటీ, సెకండ్, థర్డ్ క్వాలిటీ అనే పదాలు ఎప్పుడో పుట్టుకొచ్చేశాయి. అయితే ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూనే ఉన్నా.. పూర్తిగా రోజూ పరిశీలించడం సాధ్యమయ్యే పనికాదు. తూర్పుగోదావరి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకూ హోటల్స్, రెస్టారెంట్లు, బార్లు, కిరాణా, ఐస్‌క్రీం ఫ్యాక్టరీలు తదితర చోట్ల 123 నమూనాలను సేకరించారు. వాటిని నాచారంలోని స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కి పంపించారు. వాటిలో 39 నమూనాలు పరీక్షలో విఫలమయ్యాయి. నాణ్యత లేకపోవడం, బ్రాండ్ పేరు సరిగా లేకపోవడం, వంటనూనె ప్రమాణాల్లో బేధాలు, గడువు ముగిసిన వాటిని విక్రయిస్తుండడం వంటివి వాటిలో ఉన్నాయి. వీటి ఆధారంగా కేసులు నమోదు చేయనున్నారు. ఇక ఆహార పదార్థాల విషయంలో ఏదైనా ఫిర్యాదు చేయాలంటే ఎవరికి చేయాలో తెలియని పరిస్థితి ఉంది. గతంలో ఉమ్మడి జిల్లాలో ఒక ఫోన్ నంబరు ఉండేది. కానీ ఇప్పుడు అది పనిచేయడం లేదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ వెబ్‌సైట్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకోవాల్సిందే. అలాకాకుండా ప్రతి చోటా సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు డిస్‌ప్లే చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. దైనందిన జీవనంలో రోజు వారీగా కొన్ని ఆహార పదార్థాలు వంటల్లో ఉండాల్సిందే. కానీ అన్నీ కల్తీనే. కందిపప్పులో కేసరి పప్పు, ధనియాల పొడిలో ఉప్పు, పసుపులో లెడ్‌క్రోమెట్ మిళాయి రంగు, నూనెల్లో ఆముదం, ఆవ నూనెలో ఆర్జిమోన్ నూనె, గసగసాల్లో తోటకూర గింజలు, పాలల్లో బియ్యపు పిండి వంటివి కలిపేస్తున్నారు. వీటివల్ల ఆర్థిక నష్టమే కాకుండా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తనిఖీల కోసం మూడు బృందాలు

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి): మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి ముఖ్యమైనది నాణ్యమైన ఆహారం. రాజమహేంద్రవరంలో ప్రజలకు, పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా హోటల్స్, రెస్టారెంట్లను అప్రమత్తం చేసేందుకు నగరపాలక సంస్థ కసరత్తు చేస్తోంది. చారిత్రక రాజమహేంద్రవరం కీర్తికి ఎటువంటి మరక అంటకూడదనే ఆలోచనతో కమిషనర్ కేతన్‌గార్గ్ నగరంలో పబ్లిక్ హెల్త్‌విభాగం నుంచి మూడు ఫుడ్ సేఫ్టీ బృందాలను ఏర్పాటుచేశారు. గతంలో నగరంలో ఆహార నాణ్యత విషయంలో సమస్యలు ఉండేవి. ఇటీవల కార్పొరేషన్ ఫుడ్ సేఫ్టీ బృందాల తనిఖీలు ముమ్మరం చేయడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. హోటళ్లు, రెస్టారెంట్లలో వంటశాలలను తనిఖీలు చేసి అక్కడ వినియోగించే పరికరాలు, ఆహార తయారీకి వినియోగించే సరుకులు, నిల్వచేసిన ఆహారాలపై తరచు తనిఖీలు చేస్తున్నారు.

ఛీటింగ్..

ఇన్‌స్టా గ్రామ్‌లో నకిలీ యాప్.. రూ.28.30 లక్షలకు టోకరా!

ట్రేడింగ్ పేరుతో సైబర్ వల
మోసపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్‌లో మోసపూరిత యాప్‌తో సైబర్ నేరగాళ్లు ఒక వ్యక్తి నుంచి రూ.28.30 లక్షలు కాజేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణానికి చెందిన జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ కండాల వెంకట ద్వారకా శ్రీనివాస్ షేర్స్ వ్యాపారం చేస్తుంటారు. దీనిలో భాగంగా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో మోతీలాల్ ఆశ్వాల్ ఇనిస్టిట్యూషనల్ అకౌంట్ యాప్‌నకు కస్టమర్ కేర్ సూచనల మేర కు నాలుగు అకౌంట్స్‌కి దఫదఫాలుగా రూ. 28.30 లక్షలు చెల్లించారు. శ్రీనివాస్ తన పేరు మీద షేర్స్‌లో ఉన్న సొమ్ము విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. అయితే షేర్స్‌లో ఉన్న సొమ్ము తన అకౌంట్‌కి బదిలీ కాకపోవడంతో రాజమహేంద్రవరం వెళ్లి మోతీలాల్ ఆశ్వాల్ ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో యాప్‌కి తమకు సంబంధం లేదని, తమకు ఏ విధమైన యాప్‌లు లేవని, థర్డ్ పార్టీ అకౌంట్స్‌కి సొమ్ము పంపించడం ఉండదని ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. దీంతో శ్రీనివాస్ మోసపోయినట్టు తెలుసుకుని లబోదిబోమన్నాడు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో మంత్రులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రానికి ఊపిరిపోశాం!

120 రోజుల్లో ఆక్సిజన్ అందించాం

జగన్ రాజకీయాలకు అనర్హుడు

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

రాజమహేంద్రవరం,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సుమారు 120 రోజుల్లో ఏమి చేసిందో నాకు తెలుసు. 5 కోట్ల ఆంధ్రులకూ తెలుసు. కొందరు ఏమి చేశారని బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. మేము అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వం వెంటిలేటర్ మీద ఉంది. అటువంటి పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని ఇప్పటికే ఆక్సిజన్ పీల్చుకునే స్థాయికి తీసుకొచ్చాం' అని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ అండ్ మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తూర్పుగోదావరి రాజమహేంద్రవరంలోని మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీసీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనమయ్యాయని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందన్నారు. ప్రకృతి సంపదను జగన్ దోచేసుకున్నాడని ధ్వజమెత్తారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆంధ్రులు జగన్‌ని తరిమికొట్టి కూటమిని గెలిపించారన్నారు. ఈ 120 రోజుల్లో రూ.3 వేల పింఛన్‌ను రూ.4వేలు చేశామని, 150 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, 16,700 మంది టీచర్ ఉద్యోగాలు పొందే అవకాశం కల్పించామని, రైతులను వేధించిన భూహక్కు చట్టం రద్దు చేశామని మంత్రి పేర్కొన్నారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేయనున్నామని ఆయన తెలిపారు. నవంబరు నుంచి రాజధాని నిర్మాణం శరవేగంగా సాగనుంది. రాష్ట్రంలో అధ్వానంగా మారిన రోడ్లను సరి చేయడం కోసం రూ.400 కోట్లతో టెండర్లు ఖరారు చేశాం. మొదటి దశలో గోతులు పూడుస్తాం. రెండో దశలో పీపీపీ పద్ధతిలో రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. వైసీపీ లిక్కర్ పాలసీపై పిచ్చికుక్కలా మాట్లాడుతోంది. ఐదేళ్లపాటు లిక్కర్‌కు జగన్ సొంత పాలసీ తెచ్చాడు. తానే తయారు చేసి, తానే అమ్మి, తానే రవాణా చేసి, రూ.40 వేల కోట్లు దోచుకున్నాడు. పైగా నాసిరకం లిక్కరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాడు. ఇవాళ కూటమి మంచి లిక్కర్ పాలసీ తెచ్చింది. పారదర్శకంగా ప్రజల ముంగిట లాటరీ తీసి దుకాణాలు అప్పగించిందన్నారు. బుధవారం నుంచి రాష్ట్రంలో 40 రీచ్‌ల నుంచి ఇసుక తవ్వుతున్నాం. అందరికీ అందుబాటులో ఇసుక ఉంటుందన్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గాడిలో పెట్టారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

నన్నయలో పీజీ ప్రవేశాలకు 17న స్పాట్ కౌన్సెలింగ్

● ఉపకులపతి శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 15: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎంఏ, ఎం.కాం, ఎంపీఈడీ, ఎంఎస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లకు ఈనెల 17న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. నన్నయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో సంబంధిత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు 17వ తేదీ ఉదయం 9.30నుంచి 11 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని అన్నారు. సీట్లు, ఫీజు వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని తెలిపారు.

కూనవరంలో పెద్ద పులి సంచారం



పెద్ద పులి అడుగుజాడలు

కూనవరం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా కూనవరం మండలంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖాధికారులు గుర్తించారు. ఈమేరకు పులి అడుగుజాడలు పరిశీలించారు. కూనవరం రేంజ్ పరిధిలో పోచవరం కాలనీవద్ద ఈ పెద్దపులి అడుగుజాడలు గుర్తించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ తెలిపారు. ఇది వయస్సు ఎక్కువ గల పెద్ద పులి అని పాదముద్రలు గుర్తించినట్లు తెలిపారు. ఈపులి ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి గానీ, పాపికొండల అభయారణ్యం నుంచి గానీ వచ్చినట్లు ఆయన అన్నారు. పులిజాడ కోసం అడవిలో పది ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ పులి జంతువులు, మరెవరికీ గాని హాని తలపెట్టలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులి జాడ కోసం 30 మంది అటవీ సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు.

లారీ ఢీకొని ఉపాధ్యాయుడి మృతి



కొనకళ్ళ గణేష్ కుమార్

గోపాలపురం, అక్టోబరు 15: ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కొనకళ్ళ గణేష్ కుమార్ అనే ఉపాధ్యాయుడు తీవ్రగాయాల పాలై మృతి చెందిన సంఘటన తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం గ్రామశివారులో మంగళ వారం చోటుచేసుకుంది. ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొనకళ్ళ గణేష్ కుమార్ అనే వ్యక్తి నిడదవోలు మండలం బ్రహ్మణగూడెంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ శమిశ్రగూడెంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. మంగళవారం సెలవు పెట్టి స్వగ్రామం అయిన బొర్రంపాలెం వెళ్తుండగా గోపాలపురం గ్రామశివారులో ద్విచక్రవాహనంపై వెళుతున్న గణేష్‌కుమార్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో గణేష్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. గాయాలపాలైన గణేష్‌కుమార్ ప్రథమ చికిత్సకోసంగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం రాజమండ్రిలోని బొల్లినేని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. అతని భార్య కొనకళ్ల బేబీ ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి



తునిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి మహిళ మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ శివారున జరిగింది. అన్నవరం నుంచి తుని వైపువస్తున్న గుర్తు తెలియని రైలులో ప్ర యాణం చేస్తూ ప్రమాదశాత్తూ జారిపడి ఉంటుందని రైల్వే పోలీసులు భావిస్తున్నా రు. మహిళ వయస్సు సుమారు 40 ఏళ్ల ఉంటుందని, పసుపు రంగు పువ్వులు గల డిజైన్‌తో ఉన్న పంజాబీ డ్రస్సు ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఇంకా ఏ విధమైన ఆధారాలు లేకపోవడంతో కేసు నమో దు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువులు ఎవ రైనా ఉంటే తుని రైల్వేస్టేషన్‌లో కానీ, 9490619020లో సంప్రదించాలని కోరారు.

తునిలో కోనసీమ వాసి అనుమానాస్పద మృతి



తునిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాకు చెందిన వ్యక్తి కాకినాడ జిల్లా తుని పట్టణంలో అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. తు ని పట్టణంలో వీరంకి వారి వీధిలో ఓ ఇంటి సందులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీం తో తుని పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడివద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన అయితాబత్తుల రవికిరణ్(40)గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ప్రమాదశాత్తూ మత్స్యకారుడు మృతి

ఏలేశ్వరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ఏలేశ్వరంలో ప్రమాదవశాత్తూ మత్స్యకారుడు మృతి చెందాడు. మంగళవా రం అప్పనపాలెం వద్ద చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందాడని ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ట్యూబ్ సాయంతో చేపల వేటకు వెళ్లిన గేదె శ్రీను ప్రవాహ వేగానికి అదుపుతప్పి నీటిలో పడి పోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.





రాజమహేంద్రవరంలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, దుర్గేష్, రామానాయుడు, ఎమ్మెల్యేలు

కూటమిగా పనిచేద్దాం.. ఎమ్మెల్సీని గెలిపిద్దాం

అభ్యర్థిని ప్రకటించేలోపు.. గ్రాడ్యుయేట్ ఓటర్లను చేర్పిద్దాం

రాజమహేంద్రవరంలో రౌండ్‌టేబుల్ సమావేశం

మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, పార్టీనేతల స్పష్టీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లోపు జరిగే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాన్ని కూటమిగా పనిచేసి గెలిపిద్దామని కూటమి నేతలు ప్రతినబూనారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యవేక్షణలో మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో మంగళవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సన్నాహక సమావేశంగా ఇది నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎన్నికలో కూటమి అభ్యర్థి గెలవడానికి అందరి సహకారం కావాలన్నారు. అభ్యర్థిని అధినాయకత్వం ప్రకటిస్తుందని తెలిపారు. గ్రాడ్యుయేట్లు అందరినీ నవంబరు 6వ తేదీలోపు ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. రేపటి నుంచే నమోదు కార్యక్రమం మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గోదావరిజిల్లాల ప్రజలు 34 ఎమ్మెల్యేలు, 5 ఎంపీ స్థానాలను ఇచ్చారు. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే మొదటి ఎన్నికలు. ఇది మనకు నల్లేరుమీద నడకే అన్నారు. కానీ అభ్యర్థిని కూడా త్వరగా ఎంపిక చేసేలా అధిష్ఠానంతో మాట్లాడదామన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాతో సంబంధంలేదు మళ్లీ చేర్పించాలన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయస్ఫూర్తిని ఎమ్మెల్సీ ఎన్నికలో కూడా కొనసాగించాలన్నారు. మేమంతా ఐక్యంగా పనిచేసి, అభ్యర్థి ఎవరైనా సరే గెలిపిస్తామని చెప్పారు. వైసీపీ పోటీ చేయలేమనే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గతంలో వైసీపీ అధికారంలో ఉండగానే విద్యావంతులైన పట్టభద్రులు మూడు ఎమ్మెల్సీ స్థానాలను టీడీపీకి ఇచ్చారని, ఇక్కడ గెలిచి అదేచరిత్రను కొనసా గించాలన్నారు. బూత్‌స్థాయి నుంచి కమిటీలు వేసి అందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కలసి పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిద్దామన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అందరం ఐక్యంగా అభ్యర్థిని గెలిపిద్దాం అన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఓటర్ల నమోదు చేయించేలోపు అభ్యర్థిని ప్రకటిస్తే మంచిదని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వరరావు. చింతమనేని ప్రభాకర్, పంతం నానాజీ, సృజనారంగారావు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ మంత్రి జవహర్, జ్యోతుల నవీన్, రెడ్డి సుబ్రహ్మణ్యం, అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణ, అనంతలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, బూరుగుపల్లి శేషారావు, బీవీఆర్ చౌదరి, ఆది రెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, తోట సుధీర్, అనుశ్రీ సత్యనారాయణ, యర్రా వేణుగోపాల రాయుడు, కాశి రాజు, సత్యనారాయణ, బొమ్ముల దత్తు, రంగబాబు పాల్గొన్నారు.

కోనపాపపేటలో చోరీ

● 15 కాసుల బంగారం, లక్ష నగదు అపహరించిన దొంగలు

కొత్తపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి బంగారం, నగదు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు కొత్తపల్లి పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన చింతకాయల జగన్నాధం భవానీ మాల దీక్ష చేపట్టారు. దీక్ష పూర్తిచేసిన అనంతరం కనకదుర్గ మొక్కు చెల్లించుకొనే ందుకు కుటుంబ సభ్యులతో సోమవారం విజయవాడ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దొంగలు జగన్నాధం ఇంట్లో చొరబడి బీరువా తాళాలు బద్దలు కొట్టి 15కాసుల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు దోచుకొనిపోయారు. జగన్నాధం విజయవాడ నుంచి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో సామాన్లు చిందరవందరగా ఉండటంతో ఇనుప బీరువా తెరిచి చూసేసరికి బంగారం, నగదు కనిపించకపోవడంతో వెంటనే కొత్తపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ పి.వెంకటేష్ సిబ్బందితో జగన్నాధం ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పిఠాపురంలో పొట్టేల్ చిత్రం యూనిట్ సందడి



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పొట్టేల్ చిత్రం హీరో, హీరోయిన్లు, యూనిట్ సభ్యులు

పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది

పిఠాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని మంగళవారం పొట్టేల్ చిత్రం యూనిట్ సందర్శించింది. సినిమాలో హీరో, హీరోయిన్లుగా నటించిన యువ, అనన్య నాగళ్ల, ఆర్టిస్ట్ నోయల్, చిత్ర నిర్మాత నిషాంక్‌లు పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్ర ప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆల య అధికారులు వారిని శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

సందడి చేసిన యూనిట్

పొట్టేల్ చిత్రం యూనిట్ వచ్చిందన్న విషయం తెలుసుకున్న అభిమానులు భారీగా తరలివచ్చారు. వారితో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. పలువురు అభిమానులతో వారు సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్లు యువ, అనన్యలు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో పొట్టేల్ చిత్రం ప్రమోషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని వారు తెలిపారు.





మెగాస్టార్ చిరంజీవిని కలిసిన చంటియ్య, డాక్టరేట్ అందుకుంటున్న చంటియ్య (పాతచిత్రాలు)

సత్యదేవా నర్సరీ అధినేత చంటియ్య మృతి



పుల్లా చంటియ్య (ఫైల్)

కడియం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యదేవా నర్సరీ అధినేత, నర్సరీ సంఘం మాజీ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ(చంటియ్య) (67) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. చంటియ్యకు భార్య, కుమారుడు పెదసత్యనారాయణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చంటియ్య ఆడంబరాలకు దూరంగా ఉండేవారు. కొత్త రకం మొక్కలు సేకరించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన కొన్ని నెలల క్రితం గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు దక్కించుకున్నారు. కాగా తండ్రి పుల్లా వెంకట్రావు స్థాపించిన సత్యదేవా నర్సరీని చంటియ్య సోదరులు నాగేశ్వరరావు, అబ్బులు అభివృద్ధి చేశారు. చంటియ్య మృతితో మంగళవారం నర్సరీలు ఎగుమతులు, దిగుమతులు నిలిపివేసి సెలవు ప్రకటించారు. ఆయన మృతికి మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, డైరెకర్లు, మార్గాని సత్యనారాయణ, నర్సరీ రైతులు సంతాపం తెలిపారు.

ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పీసీఎస్‌వో తనిఖీలు



ఆటోమేటిక్ ఇంటర్ లాకింగ్ పనితీరును పరిశీలిస్తున్న పీసీఎస్‌వో

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్న విషయంపై అలసత్వం వహించవద్దని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెఫ్టీ ఆఫీసర్ (పీసీఎస్‌వో) కె.వెంకటరమణారెడ్డి సూచించారు. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం మొదలుపెట్టి రాత్రి వరకూ కలియ దిరుగుతూ విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇటీవల చెన్నైలో జరిగిన రైలు ప్రమాదం దృష్ట్యా ఈ ఆడిట్ ఇన్‌స్పెక్షన్ ప్రాధాన్యం సంతరించుకొంది. ఏదో వచ్చామా చూశామా అని కాకుండా ప్రతి అంశాన్నీ సీపీఎస్‌వో నిశితంగా పరిశీలించారు. భద్రతపై పలు సూచనలు చేయడంతో పాటు సాంకేతికంగా వచ్చే ఇబ్బందులు, ముందస్తుగా గుర్తించి తగుచర్యలు తీసుకోవడంపై అధికారులకు, సిబ్బందికి అక్కడికక్కడే కౌన్సెలింగ్ చేశారు. మెము కార్ షెడ్‌ని రెండు గంటలు పరిశీలించారు. ట్రాక్ పాయింట్లు, సిగ్నలింగ్ తదితర చోట్ల నిశితంగా పరిశీలించారు. రోడ్(ట్రాక్) నెం.2లో ఉన్న 49ఏ ఇంటర్ లాకింగ్ జంక్షన్ బాక్స్‌వద్ద తనిఖీచేసి స్వల్ప సాంకేతిక లోపాన్ని గుర్తించి సిబ్బందిని నిలదీశారు. నిధులు, సామగ్రి కొరత ఉందా అని ప్రశ్నించారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే పరిక రాలు ప్రమాణాల ప్రకారం పనిచేసే విధంగా ఉండాలన్నారు. ట్రాక్‌లలోని అన్ని పాయింట్లనూ చెక్ చేశారు. మెడికల్, యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్లలోని పరికరాలను గమనించారు. డిప్యూటీ ఎస్ఎస్ గదిలోని సాంకేతిక వ్యవస్థ పనితీరును పరిశీలించారు. డిప్యూటీ ఎస్ఎస్‌కి లోకో పైలెట్ల(రైలు డ్రైవర్లు)కు మధ్య సమాచార మార్పిడి సవ్యంగా జరుగుతుందా అనే అంశాన్ని గమనించారు. ఫ్రూ లాబీని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సీపీఎస్‌వో వెంట సీఈ/టీఎం కృష్ణారెడ్డి, సీవోఎం/జీ/సీవోఎం రవిచందర్, సీఈ/జీఈ విష్ణుకాంత్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ (విజయవాడ) విట్టల్, ఏడీఆర్ ఎం శ్రీనివాస్, ఏడీఈఎన్ చీమల ముత్యాలరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, పీడబ్ల్యుఐ ఎ.రవి, ఎస్ఎంఆర్ రంగనాథ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు తీవ్ర గాయాలు



అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయం పేరూరు వై.జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లవరం మండలం గోపాయిలంక ప్రాంతానికి చెందిన నిచ్చెనకోళ్ల రాంబాబు (60) అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ పృథ్వీ తెలిపిన వివరాల ప్రకారం రాంబాబు తన భార్య రత్నం (54)తో కలిసి అమలాపురం వైపు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. శరవేగంగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టడంతో మోటారు సైకిలిస్టు రాంబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ రత్నంను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

కుమారుడి మృతికి కారణమైన వారిని శిక్షించాలి

● మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా



అపార్టుమెంట్ వద్ద కుమారుడు చరణ్ శ్రీతేజ మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎల్‌బీ నగర్‌లో రాజేశ్వరి రెసిడెన్సీ అపార్టుమెంట్ పైనుంచి పడి మృతి చెందిన కుక్కల చరణ్ శ్రీతేజ (13) మృతికి కారణమైన వారిని శిక్షించి, న్యాయం చేయాలంటూ మృతుని తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, సత్యవేణిలు డిమాండ్ చేశారు. మంగళవారం రాజేశ్వరి రెసిడెన్సీ వద్దకు కుమారుని మృతదేహంతో వచ్చి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. తొలుత ఉసిరి చెట్టు నుంచి కాయలు కోసేందుకు చెట్టుఎక్కి కింద పడిపోయాడని, పోర్టుకో ఎక్కి పడిపోయాడని, మేడపై నుంచి పడిపోయాడంటూ పలు రకాలుగా అపార్టుమెంట్ వాచ్‌మేన్, నివాసితులు చెప్పడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయన్నారు. తమ కుమారుడు ఉదయం 10 గంటలకు బయటకు వెళ్లి ఇంటికి వచ్చి, మరలా గంట తర్వాత బయటకు వచ్చాడని, అపార్టుమెంట్‌లో ఉన్న వాళ్లు తమ కుమారుడ్ని లోపలికి రమ్మని పిలిచి, ఉద్దేశపూర్వకంగా హత్యచేసి ప్రమాదవశాత్తు మృతి చెందాడంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆరోపించారు. తమ కుమారుడు మృతి చెందిన వెంటనే అపార్టుమెంట్ యాజమాని అకస్మాత్తుగా దుబాయ్ వెళ్లిపోయాడని, దీనిపై సమ గ్ర విచారణ నిర్వహించి తమ కుమారుడు మృతికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు ఏసుబాబు, రామకృష్ణమూర్తి, దర్యాప్తు అధికారి ఏఎస్ఐ నాగేశ్వరరావులు ఆందోళనకారులు, అపార్టుమెంట్ వాసులతో చర్చించారు. పోస్టుమార్టమ్ పూర్తయిందని, నివేదిక రాగానే దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని, నివేదిక, విచారణలో హత్య జరిగినట్లు నిర్ధారణ జరిగితే నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి, మృతునికి అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు.

ఒక్కరోజు ఆగి ఉంటే కుమారుడు బతికేవాడు

సోమవారం ఒకరోజు అమ్మమ్మ ఇంటివద్ద ఉంటే తమ కుమారుడు చరణ్ శ్రీతేజ జీవించి ఉండేవాడని తల్లి సత్యవేణి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. దసరా సెలవుల్లో ఆనందంగా గడిపేందుకు తన ఇద్దరు కుమారులతో కలసి పుట్టింటికి రంగంపేట వెళ్లారు. సెలవులు ముగియడంతో సోమవారం ఉదయం కాకినాడ వచ్చారు. ఒక్కరోజు ఉండండి కాకినాడ వెళుదురుగానీ అని అమ్మమ్మ ఎంతగా బ్రతిమాలినా వినిపించుకోలేదు. సెలవులు అయిపోయాయి, స్కూల్‌కి వెళ్లాలంటూ చెప్పి వారించినా వినకుండా ఇంటికి వచ్చేశారు. నీరసంగా ఉందని, సోమవారం స్కూల్‌కి వెళ్లను రేపటి నుంచి వెళతాను అని తల్లి సత్యవేణికి చెప్పాడు.

మద్యం షాపుల సిండికేట్లలో వాటాల పంచాయితీ

గిరిజన లైసెన్సీలు, గిరిజనేతరుల మధ్య సాగుతున్న వివాదం

రంపచోడవరం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మన్యంలో మద్యం షాపుల సిండికేట్లలో వాటాల కోసం గిరిజన లైసెన్స్‌లు, గిరిజనేతరుల మధ్య పంచాయితీ సాగుతోంది. మంగళవారం ఈ విషయమై ఆయా షాపుల కేంద్రాలలో పలు సెటిల్మెంట్లు జరిగాయి. ఇక్కడ షాపుల కోసం పాడేరులో లాటరీ తీసేముందు లోపాయికారి ఒప్పందం జరిగాక లాటరీలో షాపు తగిలాక గిరిజనేతరులతో సిండికేట్ అయ్యేదిలేదని గిరిజన లైసెన్స్‌లు కొందరు చెప్పడంతో వివాదం మొదలైంది. దీంతో ఈ వివాదాన్ని సర్దుబాటు చేసుకుని షాపులను పొందాలని గిరిజనేతరులు ప్రయత్నం చేస్తూ తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. వైసీపీ, టీడీపీలు ఎవరికి వారు తమదైన శైలిలో ఈ వివాదాలను పరిష్కరించుకోవాలని చూస్తూ తమవంతు వాటాలను పొందాలని చూస్తున్నారు. ఇక్కడున్న వైసీపీ, టీడీపీ నాయకులు వేయించిన దరఖాస్తులకు లాటరీలు దక్కకపోవడంతో లాటరీల్లో ఊహించని విధంగా మద్యం షాపుల అనుభవం లేని వారికి తగలడంతో వారిని ఏదోరీతిగా ప్రసన్నం చేసుకునే పనిలో ఆయా నేతలు నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల ఒప్పందం ప్రకారం ఎవరికి షాపులు తగిలినా సిండికేట్లో అందరూ వాటాదారులే అన్న ఒప్పందాలను అమలు చేస్తుంటే, మరికొన్నిచోట్ల ఆయా ఒప్పందాలను ఖాతరు చేయని పరిస్థితులే వివాదాలకు కారణమవుతున్నాయి. ఆయా వివాదాలకు రాజకీయ జోక్యంతో పరిష్కారాలు లభిస్తున్నాయి. ఒప్పందంలో ఉన్న వారికి దరఖాస్తులతో చెల్లించిన ఫీజుకు అదనంగా 1లక్ష నుంచి 2లక్షల మధ్య చెల్లించేలా పరి ష్కారాన్ని చూపుతున్నారు. ఏదిఏమైనా వైసీపీ, టీడీపీకి చెందిన నాయ కులు సమన్వయంతోనే ఇక్కడ మద్యం సిండికేట్లను నిర్వహించు కుంటున్నారు.

వివిధ క్రీడల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

కాకినాడఅర్బన్, అక్టోబరు 15: వివిధ క్రీడల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో క్రీడాకారుల ఎంపిక డీఎస్ఏ మైదానంలో మంగళవారం నిర్వహించినట్లు స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అండర్-14,17 విభాగాల్లో సాఫ్ట్ టెన్నిస్, అండర్-14, 17, 19 విభాగాల్లో మార్షల్ ఆర్ట్స్ అండర్-17 బాలుర వాలీబాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించగా 600మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పీఈటీల జిల్లా సంఘం అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి రవిసుందర్‌కౌర్ పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో రాష్ట్రస్థాయి జట్లకు ఎంపికైన క్రీడాకారులు

హెల్ప్‌లైన్‌తో దోచేశాడు

● 55,999 సొమ్ము వెనక్కి ● సైబర్ క్రైంలో పోగొట్టుకున్న వ్యక్తి

● 10 రోజుల్లో కేసు ఛేదన

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కాజేయడానికి ప్రయత్నించిన సొమ్మును జిల్లా సైబర్ క్రైం పోలీసులు చాకచక్యంగా వెనక్కు రప్పించారు. మల్లికార్జున నగర్‌లో నివాసం ఉంటున్న కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. ఈ నెల 5న కస్టమర్ కేర్ నంబరు గురించి గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఓ నకిలీ కస్టమర్ కేర్ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా శ్రీకాంత్‌కి వచ్చిన ఓటీపీని చెప్పారు. అంతే.. క్రెడిట్ కార్డులో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెం.1930 కనెక్ట్ కాకపోవడంతో సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు.. ఆ సొమ్మును ఫ్రీజ్ చేసి పది రోజుల్లో వెనక్కి రప్పించి బాధితుడికి అందజేశారు. కేసులో ప్రతిభ చూపిన సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమా మహేశ్వరరావు, ఎస్ఐ అయ్యప్పరెడ్డి, సిబ్బంది వైఎస్‌వీ సురేశ్, పి.దుర్గా ప్రసాద్, ఎ.అరవింద్‌ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ క్రైం బారిన పడి మోసపోయామని గుర్తించిన వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైం వెబ్‌సైటులో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ విధమైన మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఘనంగా గోవమ్మతల్లి జాతర

తాళ్లరేవు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 15: గాడిమొగ పంచాయతీ బాబాన గర్‌లో గ్రామదేవత గోవమ్మతల్లి జాతర ఘనంగా జరిగింది. పటవల పంచాయతీ రామన్నపాలెం నుంచి భక్తులు తీన్‌మార్, జెండాలు, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి గోవతల్లిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు సంగాడి కామేశ్వరరావు, చింతా లక్ష్మణస్వామి ఉన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, పల్లె పండుగ కార్యక్రమాలు



పనసపాడులో సీసీ రోడ్డు నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టిన ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పనసపాడులో సీసీరోడ్ల నిర్మాణాలకు రాజప్ప కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజప్ప మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సంయుక్త కృషి మేరకు కేంద్రప్రభుత్వ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ఆగస్టు 23న నిర్వహించిన గ్రామ సభల్లో వివిధ అభివృద్ధి పనులు గుర్తించి తీర్మానాలు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అందులో భాగంగా 15 పనులను రూ.4.80 కోట్ల నిధులతో సీసీ రోడ్లు తొలివిడతగా 9 గ్రామాల్లో చేపడుతున్నట్టు తెలిపారు. మరికొద్ది రోజుల్లో అర్హత ఉన్న కుటుంబాలకు రేషన్ కార్డులు, ఫించన్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి కార్యాచరణ ఇప్పటికే ప్రారంభించారన్నారు. గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో 2 సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో డబుల్‌సెవెన్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లెలకు మహర్దశ : నానాజీ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన తర్వాత కూటమి ప్రభుత్వంలో పల్లెలకు మహర్దశ వచ్చిందని, పెద్ద ఎత్తున కోట్లాది నిధులతో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టడం జరిగిందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నేమాం, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట గ్రామాల్లో రూ.2.46 కోట్ల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న పలు సిమ్మెంట్ రోడ్లు, డ్రైనేజీలు, కనెక్టింగ్ లింక్ రోడ్ల నిర్మాణ పనులకు కూటమి నాయకులు పెంకే శ్రీనివాస బాబా, వాసిరెడ్డి ఏసుదాసు, బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావులతో కలసి భూమి పూజా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 22న నిర్వహించిన గ్రామసభలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ. 12.36 కోట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. గ్రామాల్లో జరుగుతోన్న పనుల్లో ప్రజాభాగస్వామ్యం ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఎంపీడీవో పనుపులేటి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జొన్నాడ నరసింహారావు, పిడుగు పాండురంగారావు, సత్యనారాయణమూర్తి, పార్టీ నాయకులు పోసిన రాము, దాసరి శివ, పెరికల గౌతమ్, చొక్కా జగన్, మాతా లక్ష్మణ్ ఉన్నారు.

రహదారుల అభివృద్ధే లక్ష్యం




చొల్లంగిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, పటవల, కోరింగ, తాళ్లరేవు, పోలేకుర్రు, జార్జీపేట, నీలపల్లి, సుంకరపాలెం, ఇంజరం గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిదులు రూ.3కోట్ల43లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సిక్స్‌ప్యాక్ పథకాలను దశలవారీగా కూటమి ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎం పీపీ రాయుడు సునీత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, నడింపల్లి వినోద్, గర్రే లక్ష్మీనారాయణ, పులపకూర త్రిమూర్తులు, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, జనసేన నేతలు అత్తిలి బాబూరావు, బందారు దొరబాబు, సూరంపూడి కుమార్ పాల్గొన్నారు.

తూతూమంత్రంగా కరప సర్వసభ్య సమావేశం

కరప, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కరప మండల సర్వసభ్య సమావేశంలో తూతూమంత్రంగా సాగింది. గ్రామాల్లోని సమస్యలను గాలికొదిలేసి..సభ మధ్యలోనే మెజార్టీ సభ్యులు వెళ్లిపోవడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గడిచిన 3 నెలల్లో మండలంలో జరిగిన శాఖలవారీ ప్రగతిని ఆయా శాఖల అధికారులు వివరించి సమస్యలుంటే తెలపాలని సభ్యులను కోరారు. తాగు, సాగు నీరు, విద్యుత్, ఉపాధిహామీ పథకానికి సంబంధించి వేములవాడ ఎంపీటీసీ అనసూరి శ్రీనివాసరావు, పెద్దాపురప్పాడు సర్పంచ్ బిరుదా సరస్వతి శ్రీనివాస అప్పారావు అధికారులను ప్రశ్నించారు. తక్కిన సభ్యులెవరూ తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాలేదు సరికదా..సమావేశం మధ్యలోనే లేచి వెళ్లిపోయారు. ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఈవోపీఆర్డీ సలాది వెంకటశ్రీనివాసరావు, సూపరింటెంట్ బీఎల్ నరసింహం, అధికారులున్నారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రాంబాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి శ్రీసాయి రాఘవేంద్ర సూపర్ స్పెషాలిటీస్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, అమృత రక్ష ఆస్పత్రి అధినేత డాక్టర్ మడక రాంబాబు రూ.2లక్షల విరాళం అందించారు. అమరావతి సచివాలయంలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం కలిసి చెక్కు అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడి ఆత్మహత్య

కరప, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక యువకుడు బలవన్మరణానికి పాల్పడినట్టుగా కరప పోలీసులు తెలిపారు. కరపమండలం వేములవాడ గ్రామానికి చెందిన పెరుమాళ్ల జాన్(19) పదో తరగతి పూర్తిచేసి కరప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి సమీపంలోని ఒక పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. అయితే నీరసంగా ఉందని జాన్ 4 రోజులుగా డ్యూటీకి వెళ్లకుండా ఇంటోనే ఉంటున్నాడు. సోమవారం డ్యూటీకని బయలుదేరిన జాన్ అదే రోజు సాయంత్రం యండమూరు గ్రామశివారున పంటపొలాల్లో గడ్డిమందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు అతడిని గొల్లపాలెంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. ఇంట్లోని ఆర్థిక ఇబ్బందులను భరించలేక జీవితంపై విరక్తితో పురుగులమందు తాగినట్టు అతడి తండ్రి వాసు పోలీసులకు తెలిపాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు.

'జిల్లాలో జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు'

పెద్దాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లాలో జోరుగా సాగుతున్నట్టు ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రావూరి సుధ అన్నారు. బీజేపీ నాయకురాలు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ, పెద్దాపురం నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రముఖ్ గొరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం స్థానిక మెయిన్ రోడ్డులో నిర్వహించారు. ముఖ్య అతిగా సుధ హాజరయ్యారు. బీజేపీ నేతలు కొక్కిలిగడ్డ గంగరాజు, దుర్గామోహన్‌రావు, చెరుకూరి రవికృష్ణ, అల్లు ప్రసాద్, మోటూరి వీరబాబు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ పెరేడ్ క్యాంప్ ఎంపికలు

జేఎన్టీయూకే, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు వెస్ట్‌జోన్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ పెరేడ్ క్యాంప్ ఎంపికలు మంగళవారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ డైరెక్టరేట్ నుంచి సైదా రమావత్ ఎంపిక అధికారిగా వ్యవహరించగా జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ పర్యవేక్షించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు పరుగు పందెం, ఎత్తు, బరువు, కమ్యూనికేషన్ స్కిల్స్, పెరేడ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. మొత్తం 100మంది హాజరు కాగా ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను ఎంపిక చేశామని, వారంతా నవంబరు 12నుంచి 22 వరకూ మహారాష్ట్రలోని జలగావ్ వర్సిటీలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని శ్యామ్‌కుమార్ తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ 1, 2 యూనిట్ల అధికారులు, వలంటీర్లు ఉన్నారు.

సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే కొండబాబు చర్చ

కాకినాడ సిటీ, అక్టోబరు 15: ముఖ్యమంత్రి సహాయనిధికి సిటీ నియోజకవర్గం నుంచి పలువురు దాతలు సమకూర్చిన రూ.10 లక్షల26 వేల విరాళాల చెక్‌లను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమరావతిలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అందజేశారు. నగర అభివృద్ధి, స్మార్ట్ సిటీ నిధులు మంజూరు, పోర్టు ఏరియాలో సదుపాయాల కల్పన అంశాలపై చంద్రబాబుతో చర్చించారు.

నాలుగేళ్లలో కానిది..

నాలుగు నెలల్లో అయింది!



గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వినియోగంలోకి వచ్చిన ఆర్వో ప్లాంటు

- డిప్యూటీ సీఎం చొరవతో గొల్లప్రోలు జడ్పీ పాఠశాలలో వినియోగంలోకి ఆర్వో ప్లాంటు
- తాగునీటి సమస్యకు పరిష్కారం.. పవన్ సూచనతో అధికార యంత్రాంగం చర్యలు
- ఎక్స్‌లో పోస్ట్ చేసిన డిప్యూటీ సీఎం కార్యాలయం

గొల్లప్రోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తాగునీటికోసం విద్యార్థులు నాలుగేళ్లుగా పడుతున్న ఇబ్బందులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో పరిష్కారం లభించింది. నాలుగేళ్లుగా కానిది.. నాలుగు నెలల్లో పరిష్కారమైంది.. ఆర్వో ప్లాంటు వినియోగంలోకి వచ్చింది.

గొల్లప్రోలు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కొంతకాలంగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలకు ఆర్వో ప్లాంటు పంపినా దాన్ని వినియోగంలోకి తీసుకురాలేదు. ఆర్వో ప్లాంటులోకి తాగునీరు ఎలా వస్తుందన్న విషయాన్ని విస్మరించడంతో అది మూలనపడింది. అందులోని పరికరాలు పాడయ్యాయి. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో తాగునీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇంటినుంచి తెచ్చుకున్న నీటినే వినియోగించుకుంటున్నారు. పాఠశాలల్లో పరిస్థితులపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇటీవల అధికారులతో ప్రత్యేక పరిశీలన చేయించారు. దీని లోభాగంగా ఇక్కడి పాఠశాల విద్యార్థులు నాలుగేళ్లుగా తాగునీటికోసం పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. దీంతో కలెక్టరు షాన్‌మోహన్ స్పందించి సీఎస్‌ఆర్ నిధులనుంచి రూ.4లక్షలు ఇస్తామని, తక్షణం పనులు చేపట్టాలని పబ్లిక్‌హెల్త్ ఈఈ గంగరాజును ఆదేశించారు. నగర పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు పాఠశాలకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న నూతితోపాటు సమీపంలోని రైస్‌మిల్లులో ఉన్న నూతి నీటిని కాకినాడ ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపారు. రెండుచోట్ల తాగునీరు వినియోగానికి పనికి వస్తాయని నివేదిక రావడంతో పనులు ప్రారంభించి పూర్తి చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న నూతిలోని నీటిని శుభ్రం చేసి అక్కడే మోటార్ బిగించి ఆర్వోప్లాంటు వరకూ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఆర్వో ప్లాంటును బాగు చేయించారు. దీంతో అది వినియోగంలోకి వచ్చింది. ఏళ్ల తరబడి ఉన్న తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం కార్యాలయం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేసింది. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం చూపిన చొరవను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభినందించారు.



పాఠశాల ఆవరణలో ఉన్న నూతికి మోటార్, పైపులైను ఏర్పాటు చేసిన దృశ్యం

డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారం దిశగా అడుగులు

ఎక్స్‌లో పోస్ట్ చేసిన డిప్యూటీ సీఎం కార్యాలయం

గొల్లప్రోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలో సుదీర్ఘకాలంగా ఉన్న డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయం ఎక్స్(ట్విట్టర్)లో మంగళవారం పోస్ట్ చేశారు. డంపింగ్‌యార్డు సమస్య శాశ్వత పరిష్కారం నిమిత్తం జిల్లా కలెక్టర్‌పంపిన ప్రతిపాదనలను పవన్‌కల్యాణ్ ప్రభుత్వానికి నివేదించారు. త్వరలోనే వీటికి ఆమోదం లభించనున్నది. ఈలోగా ప్రస్తుతం 1.50 ఎకరాల్లో ఇష్టారాజ్యంగా వేస్తున్న చెత్తాచెదారాన్ని ఒక క్రమపద్ధతి 25సెంట్లులో వేసి పీహెచ్‌సీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, ఎస్సీ కాలనీకి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని పవన్ సూచించారు. దీనికి అనుగుణంగా పనులు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం కార్యాలయం తెలిపింది.

ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తాం

పిఠాపురం ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ ప్రారంభించిన కలెక్టరు



పిఠాపురం ప్రభుత్వాస్పత్రిలో ఎక్స్‌రే మిషన్, వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టరు, నాయకులు

పిఠాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాలకు ప్రధాన ఆస్పత్రిగా ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం లభించగానే అదనపు భవనాల నిర్మాణంతోపాటు స్పెషలిస్టు వైద్యుల నియామకం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపడతామని తెలిపారు. పిఠాపురం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వాసుపత్రి)లో కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద రూ.15లక్షలతో సమకూర్చిన ఎక్స్‌రే మిషన్, ఇతర వైద్యపరికరాలను సంస్థ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆస్పత్రి నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని, వీటితో ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణంతోపాటు భవనాలకు మరమ్మతులు, తాగునీటి సదుపాయం, ఇతర వసతులను కల్పిస్తామని తెలిపారు.

38 గుర్తించి 9 పనులు పూర్తి చేశాం

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో అత్యవసరంగా చేయాల్సిన 38 అంశాలను గుర్తించామని, ఇందులో 9 అంశాలకు సంబంధించిన పనులను పూర్తి చేశామని కలెక్టరు తెలిపారు. దీపావళి నాటికి మిగిలిన పనులకు సంబంధించి ప్రభుత్వం లేదా సీఎస్‌ఆర్ నిధులతో చేపట్టి మూడు నెలల్లో పూర్తి చేస్తామని ఆయన అన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ కాకినాడ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు, జీఎం (హెచ్‌ఆర్) పి.పద్మనాభం, సీఎస్‌ఆర్ మేనేజరు వంశీకృష్ణ, సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సుజాత, మునిసిపల్ కమిషనరు కనకారావు, తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ ఉన్నారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ప్రాధాన్యం : కలెక్టర్

పిఠాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారిలో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కలెక్టరు షాన్‌మోహన్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో క్రీడామైదానాలు ఉన్న 32 ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్ ఉన్నత పాఠశాలలను గుర్తించి సీఎస్‌ఆర్ నిధులు రూ.16లక్షలతో ప్రతి పాఠశాలకు 21 క్రీడాపరికరాలతో ఉన్న కిట్లు రెండు వంతున అందజేయాలని నిర్ణయించారు. ఇందులో తొలివిడతగా 14 పాఠశాలలకు ఒక్కొక్క కిట్టు వంతున అందజేసే కార్యక్రమానికి పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ ఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులతో కలిసి కలెక్టరు విద్యార్థులు, ఉపాధ్యాయులకు క్రీడాకిట్లు అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి వారు పోటీల్లో ప్రావీణ్యత చూపేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

డిస్లెక్సీయాపై అవగాహన ర్యాలీలు



కాకినాడలో డిస్లెక్సీయాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం, గొల్లప్రోలులో ర్యాలీ

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రపంచ డిస్లెక్సీయాపై నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కాకినాడ అర్బన్ పరిధిలోని పగోడా మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఉన్న భవిత సెంటర్ విద్యార్థులకు సంబంధించి జరిగిన ర్యాలీని జిల్లా సహిత విద్యాసమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారి అభ్యసనలో 5రకాలకు సంబంధించి లోపాలు ఉంటాయని ఆ వైకల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చన్నారు. హెచ్‌ఎంలు బొమ్మిడి నాగపద్మవతి, దివ్య, ఐఈఆర్‌పీలు జి.నారాయణ,ఆర్.వరలక్ష్మి ఉన్నారు.

పెద్దాపురం: అభ్యాస వైకల్యాలు(డిస్లెక్సీయా) అధిగమించడం సాధ్యమేనని ఎంఈవోలు ప్రభాకరశర్మ, రామకృష్ణచౌదరి అన్నారు. పట్టణంలో భవిత, విద్యాశాఖ ఆధ్వర్యంలో లూథరన్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు మాట్లాడారు. భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్ రెడ్డి, అనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఠాపురం: విద్యార్థులు విన్న శబ్దాలను అక్షరాలుగా, పదాలుగా గుర్తించడంలో ఉన్న ఇబ్బందులను గుర్తించి వారి శిక్షణ ఇవ్వడం ద్వారా దానిని అధిగమించేలా చేయవచ్చని పిఠాపురం ఎంఈవో జి.శ్యాంబాబు అన్నారు. అభ్యాసన సమస్యగా ఉన్న దీనిని డిస్లెక్సీయాగా వ్యవహరిస్తారని అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండు వద్ద ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎమ్ రమేష్, భవిత కేంద్రం సిబ్బంది బి.రాజకుమార్, కె.ప్రసన్న, పీడీ సుధారాణి, సీఆర్‌పీ ప్రసాద్, ఓటీఎస్, భోగాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులున్నారు.

సామర్లకోట: విద్యార్థుల్లో ప్రధానంగా చదవడం, రాయడం వంటి నైపుణ్యాలపై ప్రభావం చూపించే డిస్లెక్సీయాను నివారించేందుకు ఏటా డిస్లెక్సీయా వారోత్సవాలు ప్రతీ పాఠశాలలో నిర్వహించాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో పి.ఫుల్లయ్య ఆదేశించారు. మండలంలోని నవర గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి, కె.దుర్గారాంబాబు, ఐ.హేమకొండయ్యదొర, జీవీవీ.ప్రసాద్, బేబీ నాగేశ్వరి, అనిత,పద్మావతి ఉన్నారు.

గొల్లప్రోలు: పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు డిస్లెక్సీయాపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ప్రేమకుమారి, స్పెషల్ ఎడ్యుకేటర్ గిరిప్రసాద్, సీఆర్పీ రామకృష్ణ తదితరులున్నారు.

జెడ్పీ సీఈవోకు ఎస్టీయూ వినతి

కాకినాడ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పీఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎస్టీయూ కాకినాడ జిల్లా శాఖ పక్షాన జెడ్పీ సీఈవో వీ.లక్ష్మణరావును కలిసి అధ్యక్షుడు మో త్రశ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల పీఎఫ్, ఎల్ఐసీ భీమా వాయిదా సొమ్ము ఎప్పటికప్పుడు భీమా సంస్థకు చేరేలా చూడాలని, 2023-24 జెడ్పీ పీఎఫ్‌స్లిప్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు. కె.కాశీవిశ్వనాథ్, యు.శ్రీను, సుబ్బరాజు, సంపత్‌కుమార్, రామకృష్ణలు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా అబ్దుల్‌కలామ్ జయంతి

పిఠాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ జీవితాన్ని విద్యార్థులు, యువత స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని వక్తలు ఆకాంక్షించారు. కలామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల కలామ్ విగ్రహానికి పలు సంఘాల ప్రతినిధులు, కళాకారులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఏటూజెడ్ వాలంటీర్ సారాశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గట్టి శ్రీకృష్ణదేవరాయులు, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం కార్యదర్శి కొండేపూడి శంకరరావు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి డాక్టర్ సూర్యనారాయణ,రేలంగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డు డీఎంఈ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు, ఎస్ శ్రీనగేష్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు,సత్యనారాయణ ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్: కలామ్ చిత్రపటాన్ని బోర్డుపై చిత్రీకరించి నివాళులర్పించారు గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. కలామ్ జయంతి సందర్భంగా దుర్గాడలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మనం ఫౌండేషన్, ఫోకస్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జేజీఆర్ ఆసుపత్రి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించిమందులు అందించారు.

పెద్దాపురం: శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ప్రొఫెసర్ సంతానం కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఆకడమిక్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



పిఠాపురంలో కలామ్ విగ్రహానికి నివాళి

నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు : డీఈవో



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈవో పిల్లి రమేష్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సరళీకృతమైన నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రమేష్ కోరారు. మంగళవారం వాకలపూడి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు, పాఠ్యాంశాల ప్రణాళిక, మధ్యాహ్న భోజన పథకం అమలు, నిర్వహణ పరిశీలించారు. ఎంఈవో వేణుగోపాలరావు, హెచ్‌ఎం తదితరులున్నారు.

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి : డీఎస్పీ

గొల్లప్రోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించాలని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు ఆదేశించారు. ఆయన మంగళవారం రాత్రి గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. ట్రాఫిక్‌పై ప్రత్యే క దృష్టి పెట్టాలన్నారు. అమాయకులపై ఉన్న రౌడీషీట్లు తొలగిస్తామని తెలిపారు. సంఘ వ్య తిరేక కార్యాకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ పలువురున్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

కొత్తపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పడిన సంఘటనలో పాడిగేదె దుర్మరణం చెందగా మరో గేదె చర్మం పూర్తిగా కాలిపోయిన సంఘటన మండలంలో పాత ఇసుకపల్లిలో జరిగింది. గొల్లపల్లి కృష్ణకు చెందిన పశువుల పాకపై అరరాత్రి పిడుగుపడింది. దీంతో పాకలో ఉన్న పాడిగేదే పూర్తిగా మంటల్లో కాలి మరణించగా మరో పాడి గేదె శరీరం పూర్తిగా కాలి కొనఊపిరితో ఉందని స్థానికులు తెలిపారు. జీవనాధారం కోల్పోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

పిఠాపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, పి.రాయవరం, పి.తిమ్మాపురం, బి.కొత్తూరు, వెల్దుర్తి, పి.దొంతమూరు గ్రామాల్లో 27 అభివృద్ధి పనులకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు శంకుస్థాపనలు చేశారు.

'రోడ్డు నిర్మాణం చేపట్టాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 15: గోతులమయమైన కుంభాభిషేకం రేవు రోడ్డు నిర్మాణం చేపట్టాలని టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం పోర్టు ఆఫీసర్ కె.ధర్మశాస్త్రకు వినతి పత్రం అందజేశారు. టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, చోడిపల్లి సతీష్, మూగు రాజు మాట్లాడుతూ కాకినాడ దుమ్ములపేట నుంచి కుంభా భిషేకం రేవు వరకుగల రోడ్డు పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారిందన్నారు.

'సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి'

కాకినాడ రూరల్, అక్టోబరు 15: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో ఈనెల 7న ఇచ్చిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని ఏపీ అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తోట వెంకటరామయ్య, కోశాధికారి పెంకే సత్యనారాయణ డిమాండ్‌చేశారు. సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విస్తృతస్థాయి సమావేశం కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.ఆదినారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈనెల 21న బ్యాంకు వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పలువురు పిలుపునిచ్చారు.

'రైతు కేంద్రాలతో ధాన్యం కొనుగోలు'

ఏలేశ్వరం, అక్టోబరు 15: రైతు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏవో జ్యోతి నేతృత్వంలో ధాన్యం కొనుగోలు సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు చూసి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పర్యాటక ప్రాంతాలలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని టూరిజం, రిసార్ట్స్ లలో ప్రభుత్వ నిబంధనలు పగడ్బంధీగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం టూరిజం బోట్లు, రిసార్ట్స్ య జమానులను ఆదేశించారు. మంగళవారం ఆ యన సబ్ కలెక్టరు కల్పశ్రీతో కలిసి స్థానిక ఐటీ డీఏ కార్యాయంలో తహశీల్దార్లు, బోట్లు, రిసార్ట్స్ యజమానులు, ఫారెస్టు, పోలీసు, పర్యాటక శాఖల అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలలో రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలన్నారు. పాపికొండలు పర్యాటక కేంద్రాలలో తిరిగే బోట్లకు అనుమతులు ఉండాలన్నారు. టూరిజం ప్రాంతాలకు సంబంధించిన మండలాల్లో తహశీల్దారు ఎంపీడీవో, సర్కిల్ ఇన్‌స్పెక్టరు, అటవీశాఖాధికారుతో పర్యాటకుల భద్రతకు కమి టీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 17వ తేదీ వరకు పర్యా టక ప్రాంతాలను మూసివేశామని, తుఫాను తగ్గుముఖం పట్టిన తర్వాత పర్యాటకులను అనుమతి స్తామన్నారు. పర్యాటక ప్రాంతం, రిసార్ట్స్ పరిధిలోని 500 మీటర్ల వరకు పారిశుధ్య కార్యక్రమాలు రిసార్ట్స్ యాజయాన్యం నిర్వహించాలన్నారు. ఏజె న్సీలో రిసార్ట్స్ నిర్వహిస్తున్న తీరుపై ఆరా తీశారు. సబ్ కలెక్టరు మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పా టు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు సంభవించకుండా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు కె.సుబ్బారావు, రామకృష్ణ, బి.రాజు, టీడీలు బాలాజీ, సీఐలు సీహెచ్ గోపాలకృష్ణ, ఆర్‌టీ రవికుమార్, అటవీశా ఖాధికారిణి అనుష, ఎంపీడీవోలు ఎస్.శ్రీనివాసుదొర, జయ ంతి, ఎస్ఐలు షరీఫ్, రాము, పర్యాటకశాఖాధికారి సాంబశివరావు, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం


బురదలో పక్కకు తిరిగిపోయి ఉన్న ఆర్టీసీ బస్సులు

రాజవొమ్మంగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో జాతీయరహదారి నిర్మాణంలో ఉండడంతో నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారంరాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి రాజవొమ్మంగి గ్రామశివారులో రోడ్డు పూర్తిగా బురదమయమైంది. మంగళవారం ఉదయం నర్సీపట్నం-ఏలేశ్వరం, ఏలేశ్వరం-నర్సీపట్నం వెళ్లే ఫస్ట్ బస్సులు బురదతో పేరుకుపోయిన రోడ్డువద్దకు వచ్చేసరికి ప్రయాణికులతో బస్సులు ఒక్కసారిగా అడ్డుగా తిరిగిపోయాయి. దీంతో రెండు బస్సులలో ఉన్న సుమారు 50మంది ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. డ్రైవర్ల చాకచక్యంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్లు బస్సులను అదుపుచేసి ఉండకపోతే బస్సులు తిరగబడి ఉండేవని ప్రయాణికులు వాపోయారు. బురదతో రోడ్డుపై బస్సులు నిలిచిపోవడంతో సుమారు 2గంటల పాటు ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. అనంతరం జాతీయరహదారి నిర్మాణ సిబ్బంది బస్సులను బయటకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

అట్టహాసంగా పల్లె పండుగ

చింతూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతూరులో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం అట్టహాసంగా ప్రారం భించారు. నిమ్మలగూడెం, నర్సింహాపురంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా రెండు చెరువుల నిర్మా ణాలకు పనులు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో గుంపెనపల్లి మోహన్, ఏపీవో శ్యామ్‌బాబులు మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు చెరువు పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు మడివి రాజు, కూటమి నాయకులు సురేష్‌చౌదరి, సయ్యద్ ఆసిఫ్, ముత్యాల శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వరరామచంద్రాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమం లో భాగంగా 20 లక్షల రూపాయలతో నిర్మించే సీసీ రహదారి నిర్మాణ పనులకు మంగళవారం వెట్టి లక్ష్మి భూమిపూజ చేశారు. మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధిలోని ఉమ్మడి వరం గ్రామ ప్రదాన రహదారి నుంచి తమ్మయ్యపేట గ్రామం వరకు ఉపాధి హామీ నిధులు 20 లక్షలతో సీసీరోడ్డు పనులకు శ్రీకారంచుట్టారు. ఉపాధిహామీ ఏపీవో, సీపీఎం నాయకులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా పంటకు అపరాలు మంజూరు చేయాలి

దేవీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండవ పంట అయిన దాళ్వా పంటకు అపరాలైన మినుములు, పెసర్లు మంజూరు చేయాలని దేవీపట్నం మండల వ్యవసాయాధికారి ప్రశాంతికి ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ తెల్లం శేఖర్, రైతులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఏవో స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారన్నారు.

పొలం పిలుస్తోంది

దేవీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ప్రశాంతి మాట్లాడుతూ వరి పంట దిగుబడి అధికంగా రావాలంటే సేంద్రీయ ఎరువులు వాడాలన్నారు. వరిచేలో పచ్చ పురుగు, సుడి దోమ నివారణకు సేంద్రీయ మందులు వాడటంవల్ల మానవాళికి మేలు చేస్తామన్నారు. 90శాతం సబ్సిడీ ద్వారా ఆదివాసీ గిరిజన రైతులకు వీబీఎన్ 8 రకం మినుములు పంపిణీ చేశామన్నారు. ఆదివాసీ రైతులు ఈ క్రాప్ చేయించుకోకుండా మెరక వ్యవసాయంలో మినుములు, పెసర్లు జల్లాలి అనుకుంటున్నారో ఆ రైతు నుంచి భూమి 1బి, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఫోన్ నెంబరు తీసుకుని నాలుగు కేజీల ప్యాకెట్‌కు రూ.56 చెల్లించాలన్నారు. టీడీపీ మాజీ ప్రచార కార్యదర్శి జి.శ్రీనివాస్‌కుమార్, వార్డు మెంబర్లు చిక్కాల బూరయ్య, తెల్లం చిన్నాలమ్మ, కేతల వెంకన్నబాబు, కొమరం నాగబాబుదొర, తుర్రం తాతాజీదొర, కలుం వెంకన్నదొర, కారం బాపన్నదొర, తెల్లం సోమన్నదొర, తుర్రం శివశంకర్‌దొర, కుంజం రోహిణి, పార్వతి పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో పంటల సాగు

ఎటపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామాల్లో గిరిజన రైతులు వ్యవసాయంను సేంద్రియ పద్దతిలో నిర్వహిస్తూ ఆహార ఉత్పత్తుల పంటల సాగు నిర్వహిస్తున్నారు. మండలంలో ప్రదానంగా సేంద్రియ పద్దతిలో వరి, మినుము పంటలను సాగు చేస్తున్నారు. ఈ తరహా పంటలకు వ్యవసాయశాఖ అధికారులు ప్రోత్సహిస్తూ ఉండడంతో సేంద్రియ సాగు వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. మండలంలో మొత్తం 320 ఎకరాల్లో సేంద్రియ పద్దతిలో సాగు చేశారు. కృష్ణవరంలో సేంద్రియపద్దతిలో వరి 105 ఎకరాలు, అచ్యుతాపు రంలో 60 ఎకరాలు, బండిరేవు గ్రామంలో 55 ఎకరాల్లో ఇప్పటికే సాగు చేపట్టారు. మినుము సాగు 70 ఎకరాల్లో సాగుచేయగా, ఇంకా మినుము పంటసాగు కొనసాగుతోంది. సేంద్రియపద్దతిలో సాగుచేసే పంటలకు ఆవుమూత్రం, ఆకుల కాషాయాలు, జనజీవన, ద్రవజీవన అమృతం వంటివి వినియోగిస్తారు. సేంద్రియ పద్దతిలో సాగు ఆరోగ్యానికి మేలుతోపాటు నేల సారవంతం చేస్తాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వీఆర్‌పురం ఎంపీడీవోగా శశిభూషన్‌కుమార్

వరరామచంద్రాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వీఆర్ పురం ఎంపీడీవోగా శశిభూషన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఫణీందర్‌రెడ్డి బదిలీపై కృష్ణా జిల్లాకు వెళ్లారు.

వీఆర్‌పురం తహశీల్దార్‌గా సరస్వతి

వరరామచంద్రాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వీఆర్ పురం తహశీల్దార్‌గా వై.సరస్వతి మంగళవారం బాధ్యతలు చేపట్టినారు. ఇప్పటివరకు ఆమె గోగవరం మండల తహశీ ల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆమెకు మండల రెవిన్యూ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ధారాలమ్మ తల్లి జాతర

మోతుగూడెం, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పొల్లూరు గ్రామదేవత ధారాలమ్మ తల్లి జాతర వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు కుమారస్వామి శర్మ ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరగలతో అమ్మవారి జాతర కన్నుల పండుగగా జరిగింది. మట్టపర్తి సత్యనారాయణ దంపతులు అమ్మవారికి గజమాల కానుకగా సమర్పించారు. ఆంధ్ర, చత్తీస్‌గ డ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మోతుగూడెం పోలీసులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతిభద్రతలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ధారాలమ్మ తల్లి ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

వై.రామవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రులు పురస్కరించుకుని వై.రామవరంలో రజకుల వీధిలో ఉన్న కనక దుర్గమ్మవారి గుడివద్ద మంగళవారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నసమారాధన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రహదారి అధ్వానం!


రౌతులపూడి- శంఖవరం రహదారి మధ్యలో గొయ్యి

భారీ వాహనాల రాకపోకలతో
రౌతులపూడి - శంఖవరం రోడ్డులో గోతులు
ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రౌతులపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి నుంచి శంఖవరం వరకు రహదారి అధ్వానంగా ఉండడంతో 9 కిలోమీటర్లు ప్రయాణం ప్రజలకు నరకంగా మారింది. రహదారి మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఈ రహదారి ఛిద్రమవ్వడానికి ప్రధాన కారణం రహదారి పరిమితికి మించి బండరాళ్లను తరలించే 40 నుంచి 50టన్నులు భారీ వాహనాలు తిరగడమే. కాకినాడ, రాజమండ్రి, కత్తిపూడి, అన్నవరం తదితర గ్రామాలకు వేళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం అనేకమంది ప్రయాణం చేస్తుంటారు. శృంగవరం, బంగారయ్య పేట, శంఖవరంతో పాటు శంఖవరం మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు చెందిన గర్భిణులు వైద్యపరీక్షల నిమిత్తం ప్రతి బుధవారం రౌతులపూడి ఆసుపత్రికి వస్తుంటారు. కానీ వారు ఆసుపత్రికి వచ్చే సమయంలో ఈ రహదారిలో ఇబ్బందులు పడుతున్నారు. రౌతులపూడి ఆసుపత్రి నుంచి అత్యవసర కేసులను కాకినా డకు అంబులెన్స్‌లో తరలించే సమయంలోనూ ఈ రహదారిలో ఇబ్బందులు తప్పడం లేదు. లారీలు తిరిగే వేగానికి దూళి సైతం విపరీతంగా రేగుతుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిలో గోతులు పూడ్చాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.


మూలగపూడి నుంచి బండరాళ్లతో వెళ్తున్న భారీ వాహనం

సత్యదీక్షా వస్త్రాల అందజేత


దీక్షావస్త్రాలను అందజేస్తున్న సత్యశ్రీనివాస్

అన్నవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి ప్రారంభంకానున్న సత్యదీక్షలకు సంబంధించి హిందూధర్మప్రచారంలో భాగంగా సత్యదీక్షలు స్వీకరించే గిరిజనులకు మంగళవారం ఉచితంగా దేవస్థానం సూపరెంటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ సత్యదీక్షా వస్త్రాలను అడ్డతీగలలో అందజేశారు. సుమారు 600 మంది పురుషులు, మహిళలు దీక్షలు తీసుకుంటారని అడ్డతీగల పవనకుమార్ స్వామీజీ కోరడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. ఆశ్వీయుజ మాసంలో వచ్చే మఖ నక్షత్రంరోజున దీక్షలు ప్రారంభమై కార్తీకమాసంలో వచ్చే మఖనక్షత్రంతో దీక్షలు ముగుస్తాయి. దీక్షలపై ఈ ఏడాది విస్తృత ప్రచారం కల్పించనున్నట్టు సత్యశ్రీనివాస్ తెలిపారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

జగ్గంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జనసేన ఇన్‌చార్జి తుమ్మపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీను నిర్వహిస్తున్నారు. మంగళవారం రాజమండ్రికి చెందిన వైష్ణవి కన్సల్టెన్సీ జి.మాణిక్యాలరావు ఆర్థిక సాయంతో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాణిక్యాలరావు, సూరంపాలెం బాలు, రాజు నాయుడు, ఇమ్రాన్‌ఖాన్, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, రామవరం వేణుగోపాల్, ఇనుగంటి ఓంకార్, జట్ల వీరభద్ర, స్వామి పీఎస్‌పీకే, వీరబాబు పాల్గొన్నారు.

కందిపప్పు పంపిణీ

ప్రత్తిపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశంకర్లపూడిలో నిత్యావసర సరుల పంపిణీలో భాగంగా రేషన్‌దారులకు రూ.67లు వంతున కిలో కందిపప్పును మంగళవారం పంపిణీ చేపట్టారు. టీడీపీ సీనియర్ నాయకుడు మిరియాల శ్రీను ప్రారంభించి ఇంటింటికి కందిపప్పు అందజేశారు. కార్యక్రమంలో బద్దేటి శ్రీనుబాబు, చెనుబోయిన నాగేశ్వరరావు, కాసపు వీరబాబు, వార్డుమెంబర్ కర్రి శ్రీరామ దుర్గ, బద్దెటి మునలయ్య, మహేంద్ర హరిబాబు, రేషన్‌షాపు డీలర్లు ఏపూరి తిరపతయ్య, దువ్వా గంగబాబు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

గండేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో యల్లమిల్లి గ్రామ శివారున పేకాట ఆడుతున్నట్టు సమాచారం మేరకు గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు మంగళవారం తెల్లవారుజామున దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.32,300 నగదు, 52 పేక ముక్కలు స్వాధీన పరుచుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేశారు.

మల్లేపల్లిలో అన్నదానం

గండేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి జాతీయరహదారి పక్కన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద మం గళవారం రామకుర్తి నరసింహం ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు. ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను, అడబాల భాస్కరరావు, ఎర్రంశెట్టి బాబ్జి, మేడిబోయిన శ్రీను, వెలిది చిన్నోడు ఉన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు నిరాశ, నిస్పృహలకు గురి కావద్దు, వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా చెప్పారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం నియోజకవర్గంలో 209మంది దివ్యాంగుల లబ్ధిదారులకు రూ.30లక్షలు పైబడి విలువ చేసే ట్రై సైకిళ్లు, ఇతర ఉపకరణాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాక్షిక వికలాంగత్వం కలిగిన దివ్యాంగులకు రూ.6వేలు, పూర్తి వికలాంగత్వం కలిసిన వారికి రూ.15వేలు వంతున అధికారంలోకి వచ్చిన వెంటనే పెంపుదల చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీని అమలు చేశారన్నారు. ఏ పని చేయలేకపోతున్నామనే నిరాశను విడనాడి ఏదైనా సాధించగలమనే లక్ష్యంతో దివ్యాంగులు ప్రభుత్వం నుంచే ప్రోత్సాహక ఉపకరణాలతో ఎదగాలని ఎమ్మెల్యే కోరారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్, ఎంఈవో వి.రాజబాబు, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రసంగించగా సమావేశంలో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం, బెంతుకుర్తి సుశీల అబ్బాయి, రొంగల సత్యనారాయణ, మంతెన శ్రీను, తటవర్తి సుబ్బారావు, కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, అలమండ చలమయ్య, వెన్నా శివ, జ్యోతుల పెదబాబు, పైలా సాంబశివరావు,అమరాది వెంకట్రావు, బొల్లు కొండబాబు, బద్ది రామారావు, బద్ది రమణ, సింగిలిదేవ్ సత్తిరాజు, ఇళ్ళ అప్పారావు, అడ్డాల త్రిమూర్తులు, మిరియాల శ్రీను, ఎంపీడీవోలు కేవీ సూర్యనారాయణ, ఎస్ఎస్ శర్మ, శివరామకృష్ణ పాల్గొన్నారు.

పల్లెలు ప్రగతికి పట్టు కొమ్మలు


కృష్ణాపురంలో రోడ్డు పనులు ప్రారంభించిన రాజేష్

టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్

తొండంగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లెలు ప్రగతికి పట్టు కొమ్మలని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పైడికొండ, ఆనూరు, కృష్ణాపురం గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని సిమ్మెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పల్లె పండుగ ద్వారా గ్రామీణ రహదారులు బాగవుతాయాన్నారు. ఇకపై గతుకుల రోడ్లపై ప్రయాణించాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కొయ్యా రామకేశవ, టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, తెలుగు యువత అధ్యక్షులు బంటుపల్లి అన్వేష్, కందా శ్రీధర్, వెన్నా మురళీ కృష్ణ, చందు, మేడిశెట్టి శ్రీను, జాగు గోవిందు ఉన్నారు.

పల్లెల్లో అభివృద్ధి పండుగ ప్రారంభం : ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పల్లెలో అభివృద్ధి పండుగ ప్రారంభమైందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాచపల్లి గ్రామంలో నిర్మించే సిమ్మెంటు రహదారుల నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెలు బాగుంటే రాష్ట్రం, దేశం బాగుంటుందని కూటమి ప్రభుత్వం భావించి పల్లె పండుగ పేరుతో అభివృద్ధి పనులు చేపట్టి అసలైన పండుగకు నడుం కట్టిందని తెలిపారు. రూ.5400కోట్లుతో 30వేల పనులు రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగగా చేపడుతున్నట్టు వివరించారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, మాజీ సర్పంచ్ బుద్దరాజు గోపిరాజు, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాధ్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉత్తరకంచి సర్పంచ్ మంతెను శ్రీను, చీకట్ల నాని, ఇళ్ళ అప్పారావు, బత్తుల భాస్కర్, చక్రి పాల్గొన్నారు.

డిస్లెక్సీయాపై అవగాహన ర్యాలీ

కిర్లంపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైకల్యం కారాదు చదువుకు అడ్డంకి అంటూ మంగళ వారం డిస్లెక్సీయాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిర్లంపూడి ఎంఈవోలు జోసెఫ్, చిన్నారావు మాట్లాడుతూ అభ్యసనలో ఇబ్బం దులు ఎదురయ్యే వారిని గుర్తించి రెమెడియల్ క్లాసుల ద్వారా ప్రత్యేక శ్రద్ధను కనబరిచితే వారు లోపాలను అధిగమించడానికి ప్రయత్నించగలరని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కల్యాణి, ఐఈడీఎస్ఎస్ నూకరాజు, లక్ష్మణ్, ఈఆర్పీలు సూర్యకళ, ప్రసన్న పాల్గొన్నారు.


కిర్లంపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తునిలో...

తుని రూరల్: తునిలో డిస్లెక్సీయాపై అవగాహన ర్యాలీ భవితా కేంద్రం పిల్లలు, స్థానిక పాఠశాల విద్యార్థులతో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.హేమలత మాట్లాడుతూ డిస్లెక్సీయా అనేది పిల్లల్లో అభ్యసన వైకల్యం అని దాన్ని సకాలంలో గుర్తించి శిక్షణ ఇస్తే పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఎంఈవో 2 ఐ.రామకృష్ణ మాట్లాడుతూ దీని కోసం ఉపాధ్యాయులు సమగ్ర శిక్షణ ద్వారా 5రోజుల పాటు గంట శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.భవితా సిబ్బంది శ్రీనివాస్ ఉన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన చిలుకూరి



ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను మంగళవారం ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత విద్యావిధానంలో జీవిత, భాషా నైపుణ్యాలు, తార్కిక ఆలో చనలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, దేశంలోనే అత్యుత్తమ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు పరిచేవిధంగా కృషి చేయాలని కోరారు.

'ఆదిత్య' ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ప్రొఫెసర్ రాముడు

గండేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీ నందు ఈఈఈ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న జి.రాముడు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సిల్చార్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్టు ఆదిత్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ జీవన్ జ్యోత్ సింగ్ నేతృత్వంలో డిజైన్ అండ్ అనాలసిస్ ఆఫ్ మోడిఫైడ్ మాడ్యులర్ మల్టీ లెవెల్ కన్వర్టర్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆయన సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ పొందారని తెలిపారు. ఆదిత్య ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దోలా సంజయ్‌కుమార్, విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు రాముడిని అభినందించారు.

బైక్ దొంగ అరెస్ట్

జగ్గంపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సోమవారం ఉదయం సీడీ డీలక్స్ బైక్‌ను దొంగలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ టి.రఘునాధరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కేసుకు సంబంధించిన సీసీపుటేజ్ పరిశీలించగా ఆత్రేయపురం మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన తుపాకుల రామదాసుగా గుర్తించారు. అతడు జగ్గంపేట నుంచి గోకవరం రోడ్డుపై వెళ్తుండగా మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. బైక్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. జగ్గంపేట సీఐ, ఎస్ఐను పలువురు అభినందించారు.

18న రాష్ట్ర సదస్సు

జగ్గంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 2024 నాలుగు లేబర్ కోడ్లు, 3 నేర చట్టాలను రద్దు కోసం ఈనెల 18న చేపట్టే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సంబంధిత పోస్టర్‌ను జగ్గంపేటలో మంగళవారం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యేసు, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు ఆవిష్కరించారు. 18న ఉదయం 10 గంటలకు ఎంబీవీకే భవన్ విజయవాడలో సదస్సు జరుగుతుందని తెలిపారు. బాలరాజు దుర్గారావు సైకిల్‌ఆఫ్‌వర్కర్స్ యూనియన్ నాయకులున్నారు.

సచివాలయానికి ట్రక్కు అందజేత

ఎటపాక, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎటపాక గ్రామ సచివాలయానికి రూ.2లక్షల విలువైన ట్రాక్టర్ ట్రక్కును టీడీపీ రాష్ట్ర నాయకుడు, ఆయుర్వేదిక్ వైద్యుడు మొహమ్మద్ జామాల్‌ఖాన్ వితరణగా అందజేశారు. ఈమేరకు మంగళవారం గ్రామ సచివాలయం సిబ్బందికి ట్రక్కును జామాల్‌ఖాన్ అందించారు. ట్రక్కు లేకపోవడంతో పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు ముందుకు సాగడంలేదని, పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, సచివాలయం సిబ్బంది ఇటీవల జామాల్‌ఖాన్ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో వెంటనే స్పందించిన ఆయన ట్రాక్టర్ ట్రక్కును కొనుగోలుచేసి, అందించారు. ఈసందర్భంగా జామాల్‌ఖాన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతందని చెప్పారు. సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, సచివాలయం ఈవో పద్మావతి, జేకే ట్రస్ట్ సభ్యులు జావేద్ పాల్గొన్నారు.


ట్రక్కును అందజేస్తున్న జామాల్‌ఖాన్

ఇసుక తరలిస్తున్న టిప్పర్లు సీజ్


చింతూరు పోలీసులు సీజ్ చేసిన అక్రమ ఇసుక తరలింపు టిప్పర్లు

చింతూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది టిప్పర్లను సీజ్ చేశారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు ఎటపాక మండలం నుంచి ఎనిమిది టిప్పర్లలో ఇసుక లోడ్ వేయించుకొని వయా చింతూరు మీదుగా కాకినాడవైపు తరలించే ప్రయత్నం చేశారన్నారు. ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశాల మేరకు ఇసుక తరలించే టిప్పర్లను నిలువరించి అనుమతిపత్రాలను పరిశీలించారన్నారు. వాటిలో కొన్నిటిప్పర్లకు అనుమతులు ఉండగా ఎనిమిది టిప్పర్లలో తరలిస్తున్న ఇసుకకు ఎటువంటి అనుమతులు లేనట్లు స్పష్టమైందన్నారు. దీంతో ఎనిమిది టిప్పర్లను సీజ్‌చేసి తహ సీల్దార్ కార్యాలయంలో అప్పగించామన్నారు.

అబ్దుల్ కలాం జయంతి

గండేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.